పోలీసుశాఖ.. పేద, ధనిక వంటి తారతమ్యాలు లేకుండా అత్యున్నతమైన సేవలు అందించే శాఖల్లో గొప్పస్థానం కలిగి ఉన్న శాఖ. కానీ ప్రస్తుతం వారి 'సేవ'ను పొందాలంటే వ్యయ, ప్రయాసలకు గురికావాల్సి వస్తుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసుశాఖ నుంచి ఇచ్చే పలు రకాల సర్టిఫికెట్లు పొందాలంటే కాసులు ఖర్చు చేయాల్సిందేనన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సామాన్యులకు అందుబాటులో సేవలను ఉంచాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో 'మీ-సేవ'ల నుంచి చేసుకున్న దరఖాస్తులకు 'మాకేంటి' అన్న రీతిలో కొందరు పోలీసు సిబ్బంది వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా ఈ వ్యవహారం ఏళ్ల తరబడి సాగుతుండగా.. ఇటీవల ఖమ్మం నగరంలో జరిగిన ఓ ఘటనలో విషయం వెలుగులోకి వచ్చింది.



'మీ సేవ'కు మాకెంత?

కాసులిస్తే వెంటనే క్లియరెన్స్ సర్టిఫికెట్లు

- పోలీసు శాఖలో జోరుగా సాగుతున్న దందా
- కొందరు ఏజెంట్లతో లింకులు ఏర్పాటు
- ఒక్కో సేవకు ఒక్కో రకంగా వసూలు
- ఏళ్ల తరబడి సాగుతున్న వ్యవహారం

ఖమ్మం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచి మొదలుకుని, ఉద్యోగులు, ఉద్యోగానికి వెళ్లేందుకు.. ఇలా ఒక్కో వ్యక్తికి ఒక్కో రకమైన రీతిలో పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్లు అవసరమవుతుంటాయి. ఆయా సర్టిఫికెట్లు ప్రజలకు ఇబ్బందులు లేకుండా, పారదర్శకతతో కూడిన విధంగా అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం వాటిని 'మీ-సేవ'ల దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయించింది. దానికి అనుగుణంగా గడిచిన కొన్నేళ్లుగా జిల్లాలోని పోలీస్‌స్టేషన్లలో జారీ చేయాల్సిన సర్టిఫికెట్లను అదే విధంగా మంజూరు చేస్తోంది. అయితే దరఖాస్తుదారుడు మీ-సేవల ద్వారా దరఖాస్తు చేసుకున్న తర్వాత సదరు దరఖాస్తుపై విచారణ నిర్వహించిన తర్వాతనే ఆ దరఖాస్తుదారుడికి క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉంటుంది. ఇలాంటి దరఖాస్తులు ప్రతిరోజు జిల్లాలో వందల సంఖ్యలో పోలీస్‌స్టేషన్లకు చేరుతుంటాయి. వాటిపై ఎవరికీ అంతగా నజర్ కూడా ఉండదు. దాన్నే అదునుగా భావించిన కొందరు రైటర్లు, టెక్నికల్ టీం ఆపరేటర్లు సంబంధిత స్టేషన్లలోని ఎస్‌హెచ్‌వోల లాగిన్ ఐడీలతో అడ్డగోలుగా దరఖాస్తులకు అప్రూవల్స్ ఇస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకుగాను దరఖాస్తుదారుల నుంచి అందిన కాడికి దండుకుంటున్నారన్న విమర్శలున్నాయి. వాస్తవానికి దరఖాస్తు చేసుకున్న తర్వాత వారంలోపు సదరు దరఖాస్తుపై విచారణ జరిపి క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉండగా.. కాసులు ముట్టజెప్పినవారికి ఎలాంటి విచారణ లేకుండానే గంటల వ్యవధిలోనే అప్రూవల్స్ ఇస్తున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో అసలు అప్రూవల్ ఇవ్వకూడని దరఖాస్తులకు సైతం క్లియరెన్స్ ఇచ్చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మీ-సేవల ద్వారా వచ్చిన సర్టిఫికెట్లను పోలీసుశాఖ ద్వారా అప్రూవల్ ఇచ్చేందుకు ప్రత్యేకంగా కొందరు ఏజెంట్లు సైతం తయారయ్యారంటే వారి దందా ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అంతేకాకుండా దరఖాస్తుదారుడు నేరుగా వెళ్తే పలుమార్లు రిజెక్ట్ చేసే దరఖాస్తులను సైతం ఏజెంట్లకు డబ్బులు ముట్టచెపితే వారు వాట్సప్‌లోనే రశీదు పెట్టించుకుని ఒకే చేసే స్థాయిలో ఈ వ్యవహారం సాగుతోందన్న వాదన వినిపిస్తోంది.

ఒక్కో సేవకు ఒక్కో రకంగా వసూలు

ప్రభుత్వం పోలీసుశాఖ ద్వారా జారీచేయాల్సిన సర్టిఫికెట్లకు సంబంధించి మీ-సేవల్లో చేసే దరఖాస్తులను నాలుగు రకాలుగా విభజించింది. వాటిల్లో బార్లు, దాబాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, రిసార్ట్‌లు, ఎంటర్‌టైన్‌మెంట్ పార్కుల వంటి వాటికి సంబంధించి కొత్త లైసెన్సులు, రెన్యూవల్స్ ఒక రకం కాగా, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగంలో చేరేందుకు అవసరమైన క్లియరెన్స్, విద్యార్థులకు గ్యాప్ సర్టిఫికెట్లు వంటి సేవలు, డాక్యుమెంట్లు పోయినవాటికి, పలు రకాల ఈవెంట్లకు బందోబస్తు, అనుమతులు వంటి సుమారు 60 రకాల సేవలను మీ-సేవా ద్వారా అందిస్తున్నారు. ఆయా సేవలకు సంబంధించి అప్రూవల్స్ ఇచ్చే సర్టిఫికెట్లకుగాను పోలీస్‌స్టేషన్లలో తమదైన రీతిలో వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారు అందించే సర్టిఫికెట్‌ను బట్టి రేటు నిర్ణయిస్తున్నారన్న విమర్శలున్నాయి. మీ-సేవాల ద్వారా అందించే సర్టిఫికెట్లకు సంబంధించి అత్యధికంగా వాహనాలకు సంబంధించిన ఎన్‌వోసీ, డాక్యుమెంట్లు, మొబైల్ ఫోన్లు పోగొట్టుకోవడం వంటివి, విద్యార్థులకు సంబంధించి ఇంటర్న్‌షిప్‌ల వంటివి అత్యధికంగా ఉంటాయి. వాహనాలకు సంబంధించిన ఎన్‌వోసీ నిమిత్తమైతే రూ.500నుంచి రూ.1,000 ఆస్తులకు సంబంధించిన విలువైన పత్రాలు పోగొట్టుకుంటే ఆయా ఆస్తుల విలువను బట్టి వారికి కాసులు ముట్టజెబుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా జిల్లా వ్యాప్తంగా ప్రతీరోజు వందల సంఖ్యలో సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. నెలలో వేలాది సర్టిఫికెట్లకు ఒకే చేసేస్తున్నట్టుగా తెలుస్తుండగా రూ.లక్షల్లో సామాన్యుల నుంచి పోలీసుశాఖలోని సిబ్బంది జేబుల్లోకి చేరుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ దందా కొందరు ఎస్‌హెచ్‌వోలకు తెలిసే జరుగుతోండగా, మరికొందరు కిందిస్థాయి సిబ్బంది సందట్లో సడేమియా రీతిలో ఉన్నతాధికారులకు తెలియకుండానే తతంగమంతా నడిపిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఉన్నతాధికారులు దీనిపై నజర్ పెట్టకపోవడంతో వారు ఆడిందే ఆట పాడిందే పాటగా మారిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాగా ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జిల్లావ్యాప్తంగా జారీచేసే సర్టిఫికెట్లను నిశితంగా పరిశీలిస్తే గంటల వ్యవధిలో మంజూరు చేసిన సర్టిఫికెట్లు ఎన్ని వంటి వివరాలు సేకరించి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవడంతో పాటు, మున్ముందు ఇలాంటి పరిస్థితులకు చెక్‌పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పోలీస్‌స్టేషన్ పాస్‌వర్డ్ కొట్టేశాడు

- ఎస్‌హెచ్‌వోకు తెలియకుండా క్లియరెన్స్‌లు..
- ఆర్‌టీఏ ఏజెంట్‌తో కలిసి ఓ కానిస్టేబుల్ దందా
- కేసు నమోదు.. ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్
- గుట్టుచప్పుడు కాకుండా విచారణ
- బయటకు పొక్కకుండా జాగ్రత్తలు

6



నేను ప్రజల మనిషిని

- వారికోసమే పనిచేస్తా.. పబ్లిసిటీ కోసం కాదు
- ప్రజాస్వామ్యంలో నీది నాది ఉండదు.. అంతా ప్రజలదే
- 15న 'సీతారామ' ప్రారంభోత్సవానికి మీరూ రండి
- గోదావరి జలాలు నెత్తిన జల్లుకోండి
- మీ తప్పిదాలను మా ప్రభుత్వానికి అంటగట్టకండి
- మాజీమంత్రి హరీ‌ష్‌రావుపై మంత్రి తుమ్మల విమర్శలు
- ప్రెస్‌మీట్‌లో భావోద్వేగంతో కంటతడి

ఎప్పుడూ గంభీరంగా, పదునైన మాటలతో ప్రసంగించే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తొలిసారి భావోద్వేగంతో ప్రసంగించారు. సీతారామ ఎత్తిపోతల పథకం విషయంపై బీఆర్ఎస్ నేత మాజీ మంత్రి హరీ‌ష్‌రావు చేసిన వ్యాఖ్యలపై స్పందించిన తుమ్మల తన స్వభావానికి విరుద్ధంగా భావోద్వేగంతో ప్రసంగిస్తూ హరీ‌ష్‌రావుపై ప్రతివిమర్శలు చేశారు. ఈ సందర్భంగా ఓ దశలో కళ్లు చెమర్చారు. "నా 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేసే మంత్రిగా ఉన్నానే తప్ప పబ్లిసిటీ కోసం పనిచేసేవాడిని కాదు.. చీప్ పబ్లిసిటీలు నాకు అవసరం లేదు. ప్రజల సమస్యలు సత్వరం పరిష్కరించడమే నా లక్ష్యం" అని తుమ్మల పేర్కొన్నారు.

ఖమ్మం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ప్రజాస్వామ్యంలో 'నీది నాది' అంటూ ఏదీ ఉండదని, అంతా ప్రజలు చెమటోడ్చి చెల్లించే సొమ్ముతోనే పనులు చేస్తామని తెలిపారు. ఏ ప్రభుత్వం ఉన్నా ప్రజల కోసం పని చేయాల్సిన బాధ్యత అధికారంలో ఉన్న నాయకులదన్నారు. ఇది తెలుసుకోకుండా మాజీమంత్రి హరీ‌ష్‌రావు తనపై విమర్శలు చేయడం తగదని హితవు పలికారు. 15వ తేదీన సీతారామ ఎత్తిపోతల స్విచ్‌ఆన్ కార్యక్రమానికి బీఆర్ఎస్ వాళ్లు కూడా వచ్చిన గోదావరి జలాలను నెత్తిన జల్లుకోవచ్చని తెలిపారు. వైరా సభలో మీ ప్రభుత్వంలో మీరు సీతారామ ప్రాజెక్టును ఎలా వదిలేశారో చెప్పుకునేందుకు అవకాశం కల్పిస్తానని తెలిపారు.

ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తుమ్మల బావోద్వేగంతో మాట్లాడారు. రూ.8వేల కోట్లు ఖర్చుపెట్టి ఒక్క ఎకరానికి కూడా నీళ్లివ్వకుండా అసంపూర్తిగా వదిలేసిన సీతారామ ప్రాజెక్టును కనీసం ఉన్న వనరులతోనైనా సాధ్యమైనంత వరకు నీరందించేందుకు ఏన్కూరు లింక్‌కెనాల్ ద్వారా గోదావరి జలాలను కృష్ణా ఆయకట్టుకు తరలించి వైరా, లంకసాగర్ పరిధిలో లక్షా25వేల ఎకరాలకు ఈ ఏడాది నీరివ్వవచ్చని సీఎం రేవంత్‌రెడ్డిని ఒప్పించామని తెలిపారు. ముఖ్యమంత్రి రూ.90కోట్లు మంజూరు చేయడంతో రెండునెలల్లో పనులు పూర్తిచేయించి నీళ్లు వదలబోతున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో మొదటి ఐదేళ్ల సీతారామ పనులు చేపట్టి అక్కడక్కడా కాలవలు తవ్వి మూడు పంపుహౌజ్‌లకు మోటార్లు పెట్టి వదిలేశారన్నారు. ఆ తర్వాత ఐదేళ్లు పనులు పట్టించుకోకుండా డీజైన్ మార్చి అస్తవ్యస్తం చేశారని తుమ్మల ఆరోపించారు. ప్రజల సొమ్ము వృధా కాకూడదనే తాము సత్వరం ప్రాజెక్టు పూర్తి చేయాలని భావించామన్నారు. ట్రయల్‌రన్ నిర్వహించకపోతే మోటార్లు పనిచేయవనే ఉద్దేశంతో (మిగతా 6వ పేజీలో)



కళతప్పిన ఎర్రబంగారం

- కలిసి రాని 'కూలింగ్' మంత్ర
- తిరోగమనంలో ఏసీ మిర్చి ధరలు
- కోల్డ్ స్టోరేజీల్లో భారీగా పంట నిల్వలు
- సీజన్‌లో క్వింటాలుకు రూ.23వేలు.. ప్రస్తుతం రూ.19వేలే..
- రైతుల ఆశలు ఆవిరి
- జిల్లాలో ఈ ఏడాది తగ్గనున్న మిర్చి సాగు

ఖమ్మం మార్కెట్, ఆగస్టు 13: ఎర్రబంగారం కళ తప్పుతోంది.. మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా తయారైంది మిర్చి రైతుల పరిస్థితి.. మిర్చి సాగు సీజన్‌లో కంటే అన్ సీజన్‌లో ధర మరింత పెరుగుతుందని ఆశించిన వారి ఆశలు అడియాసలు అయ్యాయి. ఫిబ్రవరి నుంచి మార్చి, ఏప్రిల్ మాసాలలో సాధారణంగా మిర్చి పంటకు సీజన్ ఉంటుంది. ఆ సమయంలో మార్కెట్‌కు భారీగా పంట అమ్మకానికి వస్తుంది. ఈ ఏడాది మిర్చి సీజన్‌లో సుమారు క్వింటాలుకు రూ.22,000 నుంచి రూ.23,550 వరకు ధర పలికింది. ఆ సమయంలో అనేకమంది రైతులు, వ్యాపారులు జూలై, ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో విదేశీ ఆర్డర్లతో ధర ఎక్కువగా ఉంటుందని భావించి కోల్డ్‌స్టోరేజీలలో తమ పంటను నిల్వ చేశారు. కానీ ప్రస్తుతం సీన్ రివర్స్ అయ్యింది. మన మిర్చిని అధికంగా కొనుగోలు చేసే చైనా, సింగపూర్, మలేషియా, థాయిలాండ్, శ్రీలంక, బంగ్లాదేశ్ తదితర దేశాల నుంచి ఈ ఏడాది ఆర్డర్లు లేకపోవడంతో ఎగుమతులు నిలిచిపోయి ధరలు పడిపోయాయి. దీంతో జిల్లాలోని కోల్డ్ స్టోరేజీల్లో పంట నిల్వ చేసిన రైతులు, పలువురు మిర్చి ట్రేడర్లు భారీగా నష్టపోయే అవకాశం ఉందని వ్యాపార నిపుణులు చెబుతున్నారు. కాగా కోల్డ్‌స్టోరేజీల్లో పంట నిల్వ చేసిన రైతులు మిర్చికి ఆశించిన ధరలు దక్కకపోవడంతో ఈ ఏడాది మిర్చి పంట సాగును తగ్గించి పత్తి, అపరాల సాగుకు మొగ్గు చూపుతున్నారు.

సీజన్‌లో రూ.23,000 ప్రస్తుతం 19,000

ఈ ఏడాది మిర్చి పంట చేతికి వచ్చే జనవరి ఏప్రిల్ మాసాల వరకు విదేశీ ఆర్డర్ల వల్ల మార్కెట్‌లో మిర్చికి డిమాండ్ బాగానే ఉంది. ఆ తరువాత మే నుంచి విదేశీ ఆర్డర్లు తగ్గిపోవడంతో ధరలు సైతం తగ్గుముఖం పట్టాయి. సీజన్‌లో క్వింటాలుకు రూ.22,000 నుంచి రూ.23,000 వరకు ధర ఉన్న సమయంలో రైతులు మున్ముందు ధరలు పెరుగుతాయని భావించి నిల్వ చేయడానికి మొగ్గు చూపారు. అంతే కాకుండా ఆ సమయంలో కొంత మంది మిర్చి ట్రేడర్లు సైతం పంటను క్వింటాలు రూ.21,000 నుంచి రూ.22,000 వరకు డీలక్స్ క్వాలిటీ పంటను కొనుగోలు చేసి శీతల గిడ్డంగులలలో నిల్వ చేశారు. అయితే ప్రసుత్తం ధరలు క్వింటాలుకు రూ.19,000లకు మించకపోవడంతో వారిలో ఆందోళన మొదలైంది. ఈ ఏడాది రైతులు లక్షల్లో నష్టపోతే వ్యాపారులు కోట్లలో నష్టపోయో ప్రమాదం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

కోల్డ్ స్టోరేజీల్లో భారీగా నిల్వలు

మున్ముందు ధరలు పెరుగుతాయని జిల్లాలోని రైతులు కోల్డ్ స్టోరేజీలలో భారీగా పంటను నిల్వ చేశారు. ఖమ్మం నగర వ్యవసాయ మార్కెట్ పరిధిలో ఉన్న 15 కోల్డ్‌స్టోరేజీలతో పాటు మధిర, నేలకొండపల్లి, మద్దులపల్లి, వైరా మార్కెట్ పరిధిలో ఉన్న మొత్తం 48 కోల్డ్ స్టోరేజీల్లో 47 లక్షల బస్తాలను నిల్వ చేసే సామర్థ్యం ఉండగా మొత్తంగా సుమారు 45లక్షల బస్తాలు నిల్వ చేశారు. అందులో రైతులకు సంబంధించినవి సుమారు 30 లక్షల బస్తాలు కాగా వ్యాపారులకు చెందినవి 15 లక్షల బస్తాలు ఉన్నాయి. కాగా ప్రస్తుతం ధరలు తగ్గుతుండటంతో మొదట పంట కొనుగోలు చేసిన దానికంటే క్వింటాలుకు రూ.4,000 ధర పడిపోయింది. అంతేకాకుండా దానికి అదనంగా శీతలగిడ్డంగి కూలింగ్ చార్జి, పంట కొనుగోలు చేసిన నగదు తాలూకా మూలధనానికి వడ్డీ అన్నీ కలిపి క్వింటాలుకు మొత్తం రూ.5,000 నష్ట పోతున్నట్లు రైతులు, వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఏడాది భారీగా నష్ట పోతున్నారు

యడ్లపల్లి సతీ‌ష్‌కుమార్, మిర్చిశాఖ ప్రధాన కార్యదర్శి

ఏసీ మిర్చి ధరలు తగ్గుముఖం పడుతుండటంతో ఈ ఏడాది రైతులతో పాటు వ్యాపారులు భారీగా నష్ట పోతున్నారు. అంతర్జాతీయ ఆర్డర్లు లేకపోవడంతో ధరలు పుంజుకునే అవకాశం లేదు. ఏదేమైనా ఈ ఏడాది మిర్చి రైతులకు, ట్రేడర్లకు గడ్డు పరిస్థితి ఎదురైంది. విదేశీ ఆర్డర్లు వస్తేనే రైతులకు, వ్యాపారులకు మేలు జరుగుతుంది. ఇంకో రెండు నెలలు పరిస్థితులు ఇలానే ఉంటే మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోతారు.

రేపు ఉమ్మడి జిల్లాకు సీఎం రేవంత్‌రెడ్డి

- 'సీతారామ' నుంచి గోదావరి జలాల విడుదల
- వైరాలో రైతు బహిరంగ సభ

ఖమ్మం, (ఆంధ్రజ్యోతిప్రతనిధి)/కొత్తగూడెం, ఆగస్టు 13: ఉమ్మడి జిల్లాలో గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించనున్నారు. సీతారామ ఎత్తిపోతల ద్వారా గోదావరి జలాలను ఏన్కూరు లిఫ్ట్ కెనాల్‌తో నాగార్జునసాగర్‌కు అనుసంధానం చేసే కార్యక్రమానికి భద్రాద్రి జిల్లా పూసుగూడెం వద్ద పంప్‌హౌస్‌ను ప్రారంభించి శ్రీకారం చుట్టబోతున్నారు. ఆ తరువాత వైరాలో రూ.2లక్షలలోపు రైతు రుణమాఫీ నిధులను విడుదల చేసి అక్కడే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన షెడ్యూల్ ఖరారైంది. గురువారం 11.45కు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ముల్కలపల్లి మండలం పూసుగూడెంకు చేరుకుంటారు. 12.55నుంచి ఒంటిగంట మధ్యలో అక్కడ సీతారామ ఎత్తిపోతల పంప్‌హౌస్-2ను ప్రారంభించి గోదావరి జలాలను విడుదల చేస్తారు. అక్కడ పైలాన్ ప్రారంభంతో పాటు పంప్‌హౌస్‌లకు పూజలు నిర్వహించి అనంతరం విలేకరుల సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.15కి పూసుగూడెంలో బయల్దేరి వైరాకు 2.45కి చేరుకుంటారు. 3గంటల నుంచి 4గంటల వరకు రూ.2లక్షల రైతు రుణమాఫీ నిధుల విడుదల చేసి బహిరంగ సభలో ప్రసంగిస్తారు. 4.45కి వైరా నుంచి హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు తిరిగి వెళ్తారు. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది.



వైరాలో సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించిన తుమ్మల 6



రోడ్డుపై నిర్మించిన ర్యాంపు

బైపాస్ కబ్జా!

- ఖమ్మం నగరంలో ఆగని అక్రమ నిర్మాణాలు
- సెట్‌బ్యాక్ లేకుండానే భవనాలకు కేఎంసీ అనుమతులు
- ఫిర్యాదు చేసిన వారిపై కేసులు
- జీవో-168, మునిసిపల్ చట్టాలను పట్టించుకోని అధికారులు
- క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తాం.. వికాస్, డీసీపీ

6

గాంధీనగరం గురుకులంలో

ఏసీబీ తనిఖీలు

- అస్తవ్యస్తంగా గిరిజన పాఠశాల, కళాశాల నిర్వహణ
- సమయం పాటించని ఉపాధ్యాయులు
- కంపుకొడుతున్న మరుగుదొడ్లు..
- ఈగలతో నిండిన వంటశాల
- సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసిన అధికారులు



గురుకులంలో తనిఖీ చేస్తున్న అధికారులు

కారేపల్లి ఆగస్టు 13: ఖమ్మం జిల్లా కారేపల్లి మండల పరిధిలోని గాంధీనగరం ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో మంగళవారం తెల్లవారుజామున 5గంటల నుంచి ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ ఆధ్వర్యంలో పలు శాఖలకు చెందిన అధికారులు తనిఖీలు నిర్వహించారు. విద్యార్థులతో మాట్లాడి మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ తమకు మెనూ ప్రకారం భోజనం అందడం లేదని తెలిపారు. నీళ్ల చారు, ఉడికీ ఉడకని అన్నం పెడుతున్నట్లు ఫిర్యాదు చేశారు. పరిసర ప్రాంతాలు అధ్వానంగా ఉండడంతో తమకు దోమలు కుట్టి జ్వారాల బారిన పడుతున్నామని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో స్పందించిన అధికారులు వంటగదిని పరిశీలించారు. అక్కడ మొత్తం ఈగలతో పరిసరాలు శుభ్రంగా లేకపోవడంతో ఏసీబీ డీఎస్పీ రమేష్ సంబంధిత ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు దుర్వాసన వస్తున్నాయని, పాఠశాలలో ఎలుకలు తిరుగుతున్నాయని, నిద్రిస్తున్న సమయంలో తమను కరుస్తున్నట్లు విద్యార్థులు తెలిపారు. పాఠశాలలో మొత్తం 27మంది ఉపాధ్యాయులు ఉండగా ఇద్దరు పత్తాలేరని, వారు కనీసం సెలవు లెటర్ కూడా ఇవ్వలేదన్నారు. సమయం పాటించాల్సిన వార్డెన్ ఉదయం 8గంటలు దాటినా పాఠశాలకు రాలేదని, విద్యార్థులకు మెనూ ఎలా అందిస్తారని హెచ్‌ఎం హరికిషన్‌ను అధికారులు ప్రశ్నించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రమేష్ మాట్లాడుతూ గాంధీనగరం గురుకుల పాఠశాల, కళాశాల నిర్వహణ దారుణంగా ఉందన్నారు. తనిఖీలో మొత్తం 20మందితో కూడిన బృందం పాల్గొందని తెలిపారు. గాంధీ నగరం గురుకులంలో జరుగుతున్న వ్యవహారంపై పూర్తి స్థాయిలో నివేదిక తయారుచేసి సంబంధిత అధికారులకు అందజేస్తామని డీఎస్పీ రమేష్ తెలిపారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కుమార్, మెడికల్‌కు సంబందించిన అధికారి విజయ్‌కుమార్, రాంరెడ్డితో పాటు 20మంది అధికారులు పాల్గొన్నారు.

అడవితల్లి ముద్దుబిడ్డ రేంజర్ అధికారి శ్రీనివాసరావు



స్మృతివనంలో మొక్క నాటుతున్న భాగ్యలక్ష్మి

- ఆయన హత్యకు గురైన ప్రదేశంలో స్మృతివనం
- పర్యాటక ప్రాంతంగా కనకగిరి గుట్టలు
- ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, సీసీఎఫ్ భీమానాయక్

చంద్రుగొండ, ఆగస్టు 13: అడవుల పరిరక్షణలో సహచర ఉద్యోగులకు ఆదర్శంగా ఉంటూ, అడవితల్లి ముద్దుబిడ్డగా రేంజ్ అధికారి చలమల శ్రీనివాసరావు గుర్తింపు పొందారని, అటువంటి అధికారిని విధినిర్వహణలో హతమార్చటం హేయమైన చర్య అని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, చీఫ్ కన్జర్వేటర్ భీమానాయక్(సీసీఎఫ్) ఆవేదన వ్యక్తంచేశారు. చంద్రుగొండ రేంజ్ పరిధిలోని బెండాలపాడు అటవీ ప్రాంతంలో రేంజర్ శ్రీనివాసరావు హత్యకు గురైన ప్రదేశంలో శ్రీనివాసరావుకు అటవీశాఖ 25 ఎకరాలో స్మృతి వనం ఏర్పాటు చేసింది. మంగళవారం ఈ స్మృతివనం ప్రారంభం సందర్భంగా శ్రీనివాసరావు భార్య భాగ్యలక్ష్మి తన కుటుంబ సభ్యులతో హాజరై వనంలో మొక్కలు నాటారు. ఈ సమయంలో ఆమె తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. తొలుత చంద్రుగొండలోని రేంజ్ ఆఫీస్ నుంచి స్మృతివనం వరకు ఏడు కిలో మీటర్ల మేర వాహనాలతో అటవీ సిబ్బంది, స్థానికులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే, సీసీఎఫ్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు మాట్లాడుతూ మానవాళి మనుగడకు ఆధారమైన అడవిని రక్షించాల్సిన బాధ్యత జమాజంలోని ప్రతి ఒక్కరికి ఉందన్నారు. దండనతో కాదు దండంతో అటవీ భక్షకులలో మార్పు తేవాలని నమ్మిన అధికారి, అదే అడవితల్లి వడిలో అడవి భక్షకుల రాక్షసత్వానికి బలైపోయారని పలువురు వక్తలు కన్నీటి పర్యంతమయ్యారు. శ్రీనివాసరావు కుటుంబానికి ప్రభుత్వ పరంగా రావాల్సిన పరిహారాలు కొన్ని అందాయని, ఖమ్మంలో ఇళ్ల స్థలం త్వరలో మంజూరు చేస్తామని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆ కుటుంబానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐదు జిల్లాల డీఎఫ్‌వోలు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

పర్యాటక కేంద్రంగా కనకగిరి గుట్టలు

అటవీ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో రూ 600 కోట్లతో మూడు పర్యాటక కేంద్రాలను ఏర్పాటు చేయతలపెట్టిందని, అందులో చంద్రుగొండ రేంజ్ పరిధిలోని కనకగిరి గుట్టలతో విస్తరించి ఉన్న అటవీ ప్రాంతం కూడ ఒకటని సీసీఎఫ్ భీమానాయక్ తెలిపారు. సభ ముగిసిన అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ శ్రీనివాసరావు హత్యతో ఈ ప్రాంతం దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిందని తెలిపారు. దీంతో పాటు గుట్టల మధ్య దట్టమైన అడవీ, గుట్టలు ఆలయాలు నిలయంగా ఉండటంతో ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా ఎంపికచేయటం జరుగుతుందని తెలిపారు.

పహానీలపై రుణాల పొందిన

రైతులకు మాఫీని వర్తింపచేయాలి

- గోదావరి జలాల పంపిణీలో భద్రాద్రి జిల్లాకు అన్యాయం:
- బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి

జూలూరుపాడు, ఆగస్టు 13:ఎన్నికలకు ముందు ప్రతి రైతుకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత రుణమాఫీలో నిబంధనలు విధించి రైతులకు అన్యాయం చేస్తోందని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్ ఆరోపించారు. మంగళవారం జూలూరుపాడులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భద్రాద్రి జిల్లా ఏజెన్సీ ప్రాంతం కావటంతో పట్టాదారు పాస్ పుస్తకాలు లేకపోవడంతో అనేకమంది రైతులు పహానీ నకళ్లపై రుణాలు పొందారని అన్నారు. ప్రభుత్వం పట్టాదారు పాస్ పుస్తకాలు ఉన్న రైతులకే రుణమాఫీ చేస్తుండటంతో పహానీలపై రుణాలు పొందిన రైతులకు నష్టం జరుగుతోందన్నారు. నిబంధనలను తొలగించి పహానీలపై రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీని వర్తింపచేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణంతో భద్రాద్రి జిల్లాలో రైతులు వేలాది ఎకరాల భూములను కోల్పోయినప్పటికీ ఈ జిల్లాలోని రైతులకు గోదావరి జలాలను అందించకుండా అన్యాయం చేస్తున్నారన్నారు. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు స్వార్ధపూరితంగా వ్యవహరించి ప్రాజెక్ట్ డిజైన్‌ను మార్చి ఖమ్మం జిల్లాకు సీతారామ జలాలను తీసుకువెళ్లటం తగదన్నారు. భూములను కోల్పోయిన రైతులకు పరిహారాన్ని అందించకుండా ఈనెల 15న సీఎం రేవంత్‌రెడ్డి సీతారామ పంపుహౌస్‌లను ప్రారంభిస్తుండటం హాస్యాస్పదంగా ఉందన్నారు. సమావేశంలో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మాదినేని సతీష్ నాయకులు రమేష్, సుబ్బు పాల్గొన్నారు.

పోస్టల్ సర్వీసులను సద్వినియోగం చేసుకోండి

పోస్టల్ సూపరింటెండెంట్ వీరభద్రస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న పోస్టల్ సూపరింటెండెంట్ వీరభద్రస్వామి

అశ్వారావుపేట, ఆగస్టు 13: పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న అన్నిరకాల పీఓఎస్‌బీ ఇన్సూరెన్స్, బ్యాంకింగ్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వీరభద్రస్వామి వివరించారు. మంగళవారం నారంవారిగూడెం బ్రాంచిలో డీసీడీపీ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఖాతాదారులనుద్దేశించి ఆయన మాట్లాడారు. పోటీ ప్రపంచంలో తపాలాశాఖ గ్రామీణ ప్రజలకోసం చిన్న మొత్తాల పొదుపు, సేవింగ్ అకౌంట్, పీపీఎఫ్‌టీడీ, ఎస్‌సీఎస్‌ఎస్, ఎంఎస్‌ఎస్‌సీ, రికరింగ్‌తో అధికవడ్డీ అకౌంట్, గ్రామీణ తపాలా జీవిత బీమా, ప్రభుత్వ ఉద్యోగులతోపాటు ప్రొఫెషనల్ డిగ్రీ వున్నవారు తపాలా జీవిత బీమా పథకం పొందవచ్చని ఆయన చెప్పారు.

ఐపీపీబీ ద్వారా జనరల్ ఇన్సూరెన్స్ సంవత్సరానికి రూ.520 ప్రీమియమ్‌తో పది లక్షల బీమా, రూ.755లతో రూ.15లక్షల బీమాను పొందవచ్చునన్నారు. ప్రతి తపాలా కార్యాలయంలో ఈ సౌకర్యాలు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో రమేష్ నాయక్, ఎస్‌పీఎం సాయి, మెయిల్ ఓవర్సీస్ బీ.శేషుకుమార్, పంచాయతీ కార్యదర్శి బిట్టా వెంకటేశ్వర్లు, సెర్ప్ సీఈ అపర్ణ, గ్రామదీపికలు దాసరి రేవతి, కె కృష్ణకుమారి, బీపీఎం దుర్వాజరావు, ఏబీపీఎం పీ.రామారావు, అంగన్‌వాడీ టీచర్ వెంకటేశ్వరమ్మ, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణి ఉత్తమ ఉద్యోగులు...

కొత్తగూడెం, ఆగస్టు 13: సింగరేణి సంస్థలో నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ.. ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా అత్యధిక బొగ్గు ఉత్పత్తి చేసిన 11 ఏరియాలకు చెందిన 12 మంది ఉద్యోగులకు ఉత్తమ ఉద్యోగులుగా సింగరేణి యాజమాన్యం గుర్తించింది. వీరిలో భూపాలపల్లి ఏరియా కేటీకేవోసీ-2 ఈపీ ఆపరేటర్ బొబ్బాల మల్లారెడ్డి, ఆర్‌జీ 3 ఏరియా ఓసీపీ 1 ఈపీ ఆపరేటర్ అబ్దుల్ రజాక్, అడ్రియాల ప్రాజెక్ట్ పోర్మెన్ బానోత్ కార్తీక్, ఆర్జీ ఏరియా జీడీకే ఓసీపీ 3, ఈపీ ఆపరేటర్ సల్లా భిక్షపతి, జీడీకే 11కార్ ఆపరేటర్ ఉడుతా బుచ్చయ్య, బెల్లంపల్లి ఏరియా ఖైరగూడ ఓసీపీ ఈపీ ఫిట్టర్ ఎంజారపు విజయ్‌కుమార్, మందమర్రి ఏరియా శాంతి ఖని హెడ్ ఓవర్ మ్యాన్ పొట్టా రాజలింగయ్య, శ్రీరాంపూర్ ఏరియా ఆర్‌కే 6 ఇంక్లయిన్ ఎస్‌డీఎల్ ఆపరేటర్ కర్రె భీరయ్య, మణుగూరు ఏరియా ఎలక్ట్రీషియన్ షేక్ షైబాషా, ఇల్లెందు ఏరియా కేవోసీ ఫిట్టర్ కొంగర వెంకటేశ్వర్లు, కొత్తగూడెం ఏరియా కిష్టారం ఓసీ ఫిట్టర్ ఐనవెల్లి శ్రీనివాసరావు, ఎస్‌టీపీపీ సీనియర్ అసిస్టెంట్ మహమ్మద్ నిషారుద్దీన్‌లు ఉన్నారు. సింగరేణి ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన వారిని 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆగస్టు 15న కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో సన్మానించనున్నట్టు పి.సామ్యూల్ సుధాకర్ (జీఎం పర్సనల్, వేల్ఫేర్, ఆర్‌సీపీ) తెలిపారు.

సాగర్‌లో పుష్కలంగా నీరు

- కల్లూరు సర్కిల్‌కు సాగునీటి విడుదలలో జాప్యం
- సాగర్ నీటి కోసం రైతుల ఎదురు చూపులు
- పంటలను కాపాడాలంటున్న రైతులు



ఎండిపోతున్న వరి పైరు

కల్లూరు, ఆగస్టు 13: సాగర్‌లో పుష్కలంగా నీరున్న ఎడమకాల్వ పరిధిలోని ఆయకట్టు చివరి భూములకు నీటి విడుదలపై ప్రభుత్వం ఎలాంటి షెడ్యూల్ ప్రకటించలేదు. దీంతో జలవనరుల శాఖ కల్లూరు సర్కిల్ పరిధిలో ఈ వానాకాలం పంట సాగుకుగాను కాల్వ చివరన ఉన్న ఆయకట్టు మెరక ప్రాంతాల్లో రైతులు ముందస్తుగానే కరివేద సాగుతోపాటుగా వరినాట్లు వేశారు. ఇప్పటి వరకు తుఫాన్లతో కురిసిన వానలతో వరి పైరుకు సాగునీరు అందించారు. కానీ గత మూడు రోజుల నుంచి ఎండ తీవ్రత పెరిగింది. కరివేద సాగు వరి పైరులో కలుపు మందు పిచికారి చేయాలంటే నీరు తీసివేయాలి. మళ్లీ 48 గంటలలోగా తడిపెట్టాలి. కానీ సాగునీరు లేకపోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. కల్లూరు డివిజన్ పరిధిలో కల్లూరు, తల్లాడ మండలాల్లో 50వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇటీవల ఎండల తీవ్రత పెరగడంతో సాగునీటి ఎద్దడి ఏర్పడింది. సాగర్ ఎడమకాల్వ పరిధిలో చివరన కల్లూరు సర్కిల్ పరిధిలో స్థిరీకరించిన ఆయకట్టుకు ఆగస్టు నెల మొదటివారం నుంచి సాగునీటి విడుదల చేయడం ఆనవాయితీ. అందుకు భిన్నంగా పక్షం రోజులు కావస్తున్న ఇంతవరకు నీటి విడుదలపై అధికారులు స్పష్టత ఇవ్వకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కల్లూరు మండలం పరిధిలో గల చంద్రుపట్ల, దారుగాబంజర, బత్తుపల్లి, కప్పలబంధం, వెన్నవల్లి, లింగాల, వాచ్యానాయక్ తండ తదితర గ్రామాలకు చెందిన రైతులు సాగు నీటి ఎద్దడితో గగ్గోలు పెడుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి ఆయకట్టుకు నీరు విడుదల చేసి పంటలను కాపాడాలని కోరుతున్నారు.

మంత్రులు చొరవ చూపాలి

సాగర్‌లో పుష్కలంగా నీరు ఉన్న కల్లూరు జలవనరుల శాఖ సర్కిల్ పరిధిలో ఆయకట్టుకు నీటి విడుదలపై అధికారులు ఇంతవరకు షెడ్యూల్ ప్రకటించలేదు. ఈ దశలో సాగర్ ఆయకట్టు మెరక భూముల్లో సాగు చేసిన వరి పైరు సాగునీరు లేక ఎండి పోయేదశకు చేరుకుంది. ఇప్పటికైనా జిల్లా మంత్రులు, ఎమ్మెల్యే స్పందించి సాగునీరు విడుదలపై సత్వరమే చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

జిల్లాలో రేషన్ బియ్యం కొరత

- డీలర్లకు సరఫరా కాని బియ్యం
- వినియోగదారుల ఆందోళన



గోదాం ఇన్‌చార్జికి వినతిపత్రం ఇస్తున్న డీలర్లు

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 13: జిల్లాలో రేషన్ బియ్యం కొరత అటు డీలర్లను, ఇటు వినియోగదారులను ఆందోళన పరుస్తోంది. జిల్లాలో 13 తేదీ వరకు 748 షాప్‌లకు బియ్యం సరఫరా కావాల్సి ఉండగా కేవలం 600 షాప్‌లకు మాత్రమే గోదాం నుంచి బియ్యం పంపిణీ చేశారు. మిగిలిన దుకాణాలకు నేటివరకు (మంగళవారం) బియ్యం పంపిణీ కాలేదు. దీంతో రేషన్ డీలర్లు వినియోగదారులకు సమాధానం చెప్పలేక నానా అవస్థలు పడుతున్నారు. వాస్తవానికి ప్రతి నెలా 15వ తేదీలోగా రేషన్ పంపిణీని వినియోగదారులకు అందించాల్సి ఉంటుంది. కానీ 15వ తేదీ దగ్గర పడుతున్నప్పటికీ ఖమ్మం అర్బన్, రూరల్ ఎంఎల్ఎస్ పాయింట్‌కు డీలర్లు పెద్దఎత్తున బియ్యం కోసం మంగళవారం వచ్చారు. కానీ అక్కడ ఒక్క లారీలోడ్ మాత్రమే ఉండడంతో తమకంటే తమకు కావాలంటూ వాదనకు దిగారు. దీంతో విషయం కాస్తా జిల్లా అధికారులకు చేరింది. డీలర్ల సంఘం నాయకులు డీఎస్వో దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో గోదాం వద్ద డీలర్లు నిరసన వ్యక్తం చేశారు. మరిన్ని లోడ్లు వచ్చిన తర్వాత బియ్యంను తీసుకెళ్లాలంటూ డీఎం శ్రీలత సూచించడంతో డీలర్లు నిరసన ముగించారు.

ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలి

రైల్వే జీఎంను కోరిన ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి



రైల్వే జీఎంతో మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు13: కొత్తగూడెం రైల్వే స్టేషన్ (భద్రాచలం రోడ్) నుంచి నడిచే ప్యాసింజర్ రైళ్లను తిరిగి పునరుద్ధరించాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రాఘురాంరెడ్డి మంగళవారం కోరారు. సికింద్రాబాద్‌లో రైలు నిలయంలో సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నెలకొని ఉన్న రైల్వే సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కరోనా సమయంలో కొత్తగూడెం నుంచి ఐదు ప్యాసింజర్ రైలు సర్వీస్‌లు నడిపించే వారని గుర్తు చేశారు. తదనంతరం ఈ రైలు సర్వీస్‌లను రద్దు చేశారని, తక్షణమే ఈ రైలు సర్వీస్‌లను పునరుద్ధరించాలని కోరారు. అదేవిధంగా కొత్తగూడెం రైల్వే స్టేషన్ వద్ద రోడ్ విస్తరణకు అనుమతించాలని అందుకు స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఖమ్మం రైల్వే స్టేషన్ సమీపంలో శ్రీనివాస్‌నగర్ వద్ద అదనపు రైల్వే ట్రాక్ విస్తరణ పనులతో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని, ఈ ప్రాంతంలోనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీని నిర్మించాలని పేర్కొన్నారు. ఈ సమస్యలను పరిష్కరిస్తానని ఖమ్మం ఎంపీకి రైల్వే జీఎం హామీ ఇచ్చారు.

పోలీస్‌స్టేషన్ పాస్‌వర్డ్ కొట్టేశాడు

ఎస్‌హెచ్‌వోకు తెలియకుండా క్లియరెన్స్‌లు..

ఖమ్మం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అక్రమ మార్గంలో డబ్బు సంపాదించాలన్న అత్యాస.. ఓ పోలీస్ కానిస్టేబుల్‌ను దొంగగా మార్చింది. ఏకంగా తనకు సమీపంలో ఉన్న మరో పోలీస్‌స్టేషన్ పాస్‌వర్డ్‌నే కొట్టేసిన సదరు కానిస్టేబుల్ పలు దరఖాస్తులకు అప్రూవల్స్ ఇచ్చేశాడు. అయితే ఈ వ్యవహారం జిల్లా ఉన్నతాధికారులకు తెలియడంతో గుట్టుచప్పుడు కాకుండా విచారణ నిర్వహించిన అధికారులు.. విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కాగా ఈ సంఘటనలో ఓ కానిస్టేబుల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు కాగా అతడితోపాటు మరో కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు వేసినట్టు తెలిసింది.

ఖానాపురంహవేలి పోలీస్‌స్టేషన్‌కు సంబంధించి 'మీ-సేవా'ల ద్వారా వచ్చిన దరఖాస్తులను స్టేషన్‌లో టెక్నికల్ టీం ఆపరేటర్‌గా పనిచేస్తున్న కానిస్టేబుల్ శివకృష్ణ మీ-సేవా పోర్టల్‌ను చెక్ చేస్తున్న క్రమంలో వారికి తెలియకుండానే పదుల కొద్దీ దరఖాస్తులు అప్రూవల్ చేయబడి ఉండటాన్ని గుర్తించాడు. వెంటనే స్టేషన్‌లోని సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించగా గతంలో అదే స్టేషన్‌లో పనిచేసిన టెక్నికల్ టీం ఆపరేటర్‌గా పనిచేసిన మహేష్ పోలీస్‌స్టేషన్ ఐడీ, పాస్‌వర్డ్‌లను ఉపయోగించి పలు దరఖాస్తులకు అప్రూవల్ ఇచ్చినట్టుగా తేలడంతో ఖమ్మం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మహేష్‌పై కేసు నమోదు చేశారు. అతడితో పాటు మరో కానిస్టేబుల్‌పై కూడా సస్పెన్షన్ వేటు వేసినట్టు సమాచారం. కాగా జులై 24న ఈ సంఘటన జరగ్గా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ఆర్‌టీఏ ఏజెంట్‌తో కలిసి దందా...

కానిస్టేబుల్ అప్రూవల్స్ ఇచ్చిన మీ-సేవా సర్టిఫికేట్లన్నీ ఒకే మోబైల్ నెంబరుతో రిజిస్టర్ అయి ఉన్నట్టు తెలుస్తోంది. అంతేకాకుండా అలాంటి సర్టిఫికెట్లు వేలల్లో చేసినట్టుగా ప్రచారం జరుగుతోంది. అయితే ఆ మొబైల్ నెంబర్ ఖమ్మం ఆర్‌టీఏ కార్యాలయానికి చెందిన ఓ ఏజెంట్‌దని తేలింది. ఆర్‌టీఏ కార్యాలయానికి సంబంధించి పోలీస్‌శాఖ ద్వారా సమర్పించాల్సిన ఏ సర్టిఫికెట్ అయినా సదరు ఏజెంట్ వద్దకే చేరుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మిగిలిన ఏజెంట్లు సైతం పోలీసు శాఖ క్లియరెన్స్ సర్టిఫికెట్ కావాలంటే సదరు వ్యక్తినే సంప్రదించి రూ.1,000 సమర్పించుకోవాల్సిందేనని సమాచారం. అలా చేరిన దరఖాస్తులకు సంబంధించిన రశీదులను సదరు ఏజెంట్ నేరుగా వాట్సప్ ద్వారా పోలీస్‌స్టేషన్లలోని ఆపరేటర్లకు పంపించి గంటల వ్యవధిలోనే ఒకే చేయించనున్నట్టు తెలుస్తోంది. అలా వేలాది సర్టిఫికెట్లను మంజూరు చేయించినట్టుగా ప్రచారం జరుగుతుండగా వాటిల్లో భారీగా దొంగ సర్టిఫికెట్లు ఉండే అవకాశం ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ దందాలో కేవలం ఓ కానిస్టేబుల్ వ్యవహారం మాత్రమే వెలుగులోకి రాగా.. మరికొన్ని పోలీస్‌స్టేషన్లలోని ఆపరేటర్లతోనూ సదరు ఏజెంట్‌కు సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలూ ఉన్నాయి. సందర్భాన్ని బట్టి ఆయా స్టేషన్లలోని ఆపరేటర్లతో సర్టిఫికెట్లు ఒకే చేయిస్తారనీ, ఈ క్రమంలోనే పక్క స్టేషన్లో ఐడీ, పాస్‌వర్డ్‌తో సదరు కానిస్టేబుల్ అప్రూవల్స్ ఇచ్చి ఉండొచ్చన్న ప్రచారం జరుగుతోంది. కాగా దీనిపై లోతైన విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు.

నేను ప్రజల మనిషిని

(5వ పేజీ తరువాయి)

వాటిని వినియోగంలోకి తెచ్చేలా తమ ప్రభుత్వం కృషిచేస్తుంటే తప్పుడు విమర్శలు చేయడం హరీశ్‌రావుకు తగదన్నారు. మొదటి పంపుహౌజ్‌ను తాను స్విచ్‌ఆన్ చేయలేదని, నీటిపారుదల శాఖ నిపుణుడు పెంటారెడ్డితో చేయించానని తెలిపారు. మంత్రిగా ఉండి ఒక మనిషిలా నిలబడి గోదవరి జలాలను తలపై చల్లుకున్నానన్నారు. తన రాజకీయ జీవిత లక్ష్యం ఉమ్మడి జిల్లా ప్రజలకు గోదావరి జలాలను అందించడమేనని, అది కళ్లారా చూసి రైతుల భూములను సస్యశ్యామలం చేయాలన్నదే తన జీవిత ఆశయమన్నారు. అంతేకానీ ఫ్లెక్సీలకు, ప్రకటనల కోసం, నా స్వార్థం కోసం తాను ఏనాడు ఏ పనీ పనిచేయలేదన్నారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో గెలిచనప్పుడు ప్రజలకోసం పని చేయడం, ఓడిపోతే వ్యవసాయం చేసుకోవడమే తన కర్తవ్యంగా భావించా తప్ప టికెట్లు, డబ్బు, పదవులకోసం పాకులాడలేదన్నారు.

ఉమ్మడి రాష్ట్రంతో పాటు తెలంగాణ రాష్ట్రంలోనూ మంత్రిగా అప్పటి ముఖ్యమంత్రులు జలగం వెంగళరావు, ఎన్టీఆర్, వైఎస్ఆర్, చంద్రబాబునాయుడు చేసిన అభివృద్ధి పనులు ఎక్కడైనా మిగిలితే వాటిని పూర్తిచేశానే తప్ప గత ప్రభుత్వాలు చేపట్టిన పనులని వివక్షత చూపించలేదన్నారు. ఎన్టీఆర్ ఆశీస్సులతో రాజకీయాల్లోకి వచ్చి అనేక శాఖలకు మంత్రి పదవులు చేపట్టే అవకాశం తనకు లభించిందన్నారు. ఉమ్మడిరాష్ట్రంలో భారీనీటిపారుదల, రోడ్లుభవనాల శాఖ మంత్రిగా అనేక ప్రాజెక్టులు పూర్తిచేశానని, తన చేతులమీదుగా శంకుస్థాపన చేసిన ప్రాజెక్టుల నుంచి నీరు వదిలి రైతుల భూములను సస్యశ్యామలం చేశానే తప్ప పబ్లిసిటీకోసం, స్వార్థం కోసం చేయలేదన్నారు. భారీనీటి పారుదలశాఖ మంత్రిగా ఉన్నప్పుడు దుమ్ముగూడె ప్రాజెక్టుకు 1997లో ప్రతిపాదనలు చేశానని గుర్తు చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు అన్ని నియోజకవర్గాలకు నీరందించేందుకు కృషిచేయాలని భావించానే తప్ప మరో స్వార్థం లేదన్నారు. అప్పట్లో నీటిపారుదలశాఖకు రూ.వెయ్యి కోట్ల బడ్జెట్ ఉండేదని, అందువల్ల సాధ్యం కాలేకపోయిందన్నారు. ఆ తర్వాత రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో దుమ్ముగూడెం ప్రాజెక్టును రెండుగా చేసి రాజీవ్, ఇందిరసాగర్ పేరుతో కాలవలు తవ్వి పైపులు వేశారే కానీ మోటార్లు అమర్చలేదన్నారు. దుమ్ముగూడెం ప్రాజెక్టును విడదీయడం వల్ల ఇబ్బందులు ఉంటాయని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ఆర్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు. దుమ్ముగూడెం కాటన్ ఆనకట్ట నుంచే పంపుహౌజ్‌లు పెట్టాలని సూచించినట్లు తెలిపారు. ఆ తర్వాత ఖమ్మం ఎమ్మెల్యేగా కూడా దుమ్ముగూడెం ప్రాజెక్టు ఆవశ్యకతను రాజశేఖరరెడ్డి దృష్టికి తీసుకెళ్లానని, దురదృష్టవశాత్తు ఆయన మరణించిన తర్వాత రాజీవ్, ఇందిరసాగర్ ప్రాజెక్టుల నిర్మాణానికి నోచుకోకుండా అసంపూర్తిగా వదిలేశారని పేర్కొన్నారు.



తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తాను మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పుడు కూడా దుమ్ముగూడెం ప్రాజెక్టు తన చిరకాలస్వప్నం అని, గోదావరి జలాలు ఖమ్మం జిల్లాకు అందించడం తన లక్ష్యమని, ఇం దుకు అంగీకరిస్తేనే పార్టీలోకి వస్తానని స్పష్టం చేసినట్లు గుర్తు చేశారు. అందుకు అనుగుణంగానే సీతారామ పనులు ప్రారంభించామన్నారు. మొదటి ఐదేళ్లు పనులు బాగానే నడిచినా తర్వాత డిజైన్ మార్చి అసంపూర్తిగా వదిలేశారన్నారు. గత ఎన్నికల సందర్భంలో రాహుల్‌గాంధీ కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించినప్పుడు కూడా సీతారామ ప్రాజెక్టుతో గోదావరి జలాలను ఖమ్మంజిల్లా ప్రజలకు అందించే విషయంపై కూడా మాట్లాడినట్లు వివరించారు. అయితే ప్రస్తుతం సీతారామ ప్రాజెక్టుతో పూర్తిస్థాయిలో నీరందాలంటే జూలూరుపాడు, యాతాలకుంట టన్నెల్ పూర్తికావాల్సి ఉందన్నారు. పాలేరు ట్రంక్ పూర్తయితేనే బయ్యారం, ఇల్లెందు ప్రాంతాలకు నీరు వెళ్లే పరిస్థితి ఉంటుందన్నారు. ఇవన్నీ పూర్తిచేసి గోదావరి నీరు వదలాలంటే సుదీర్ఘ కాలం పట్టే పరిస్థితి ఉందని, అందువల్ల ఉన్న నిధులతో పనులు చేయించి గోదావరి జలాలను సీతారామ ఎత్తిపోతల ద్వారా వైరాకు చేర్చేందుకు 8కి.మీ పొడవున రూ.90కోట్లతో లింకెనాల్ పనులు రెండు నెలల్లో పూర్తిచేయించామన్నారు. ఇందుకోసం మూడు పంపుహౌజ్‌లను రన్నింగ్‌లో పెట్టామని, మొదటి పంపుహౌజ్‌వద్ద నీటిపారుదలశాఖ సలహదారు స్విచాన్ చేసి నీటి విడుదల చేస్తే తనపై వ్యక్తిగతంగా మాజీ మంత్రి హరీష్‌రావు విమర్శలు చేయడం తగదన్నారు. పరిహారం ఇవ్వకపోయినా భూసేకరణ ప్రక్రియ లేకపోయినా రైతులు స్వచ్ఛందంగా 125 ఎకరాలు ఇచ్చి తమ పంటలు కూడా తొలిగించి భూములు ఇచ్చారని గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిరుపయోగంగా ఉన్న సీతారామ ఎత్తిపోతల పథకాల పనులను తిరిగి ప్రారంభించి రైతులకు సాగు నీరు ఇస్తుంటే తప్పుడు విమర్శలు చేయడం తగదన్నారు.

తాను గతంలో మంత్రిగా ఉన్నప్పుడు నాగార్జునసాగర్ కాలవపైనా ఎన్నో ఎత్తిపోతల పథకాలు నిర్మించానని, దుర్భిక్ష మండలాలుగా ఉన్న తిరుమలాయపాలెం, వేంసూరు మండలాలకు సాగునీరు కల్పించానన్నారు. భక్తరామదాసు ప్రాజెక్టు ద్వారా వృధాగా ఉన్న శ్రీరాంసాగర్ కాలవలకు నీరు వదిలి 76వేల ఎకరాలకు నీరందించి పాలేరు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేశానన్నారు. తద్వారా అక్కడ భూముల విలువల లక్షలు, కోట్లలో పెరిగేలా చేశానని తుమ్మల గుర్తుచేశారు. సీతారామచంద్రస్వామి ఆశీర్వాదంతో సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టును వినియోగంలోకి తెస్తుంటే చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీతారామ ద్వారా దశలవారీగా జిల్లాలో పది నియోజకవర్గాలకు నీరు వెళతాయని, ప్రధాన కాలవలకు అనుసంధానంగా డిస్ట్రిబ్యూటరీ కాలవలు నిర్మించి నీరిస్తామన్నారు. తాను గతంలో కూడా అభివృద్ధిలో ఎక్కడా వివక్షత చూడలేదన్నారు. తాను ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గంకంటే జిల్లాలో అత్యంత వెనుకబడి ఉన్న ఇల్లెందు, భద్రాచలం, పినపాక నియోజకవర్గాల అభివృద్ధికి పనిచేశానన్నారు. ప్రతిరోడ్డు, ప్రతి బ్రిడ్జి ప్రతి లిఫ్టు, ప్రతి ప్రాజెక్టు సాధనలోనూ అభివృద్ధి పనుల్లోనూ తన భాగస్వామ్యం ఉండాలని, ప్రజల సమస్యలు పరిష్కరించాలని పనిచేశానని తెలిపారు. జిల్లాలో నిస్వార్థంగా పనిచేసిన ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల గ్రామాలకు సైతం రోడ్లు వేసి, మంచినీరు ఇచ్చి మౌలికసదుపాయాలు కలిపించానన్నారు. అంతేకానీ క్రెడిట్‌కోసం, ఫ్లెక్సీలకోసం కాదని గుర్తించాలన్నారు.

నీటిపారుదలశాఖ నిపుణులు పెంటారెడ్డి బటన్‌నొక్కి మోటార్ ఆన్‌చేస్తే నీటిని చూసిన ఆనందంతో గోదావరి నీళ్లు చల్లుకోవాలనే తాపత్రయంతో అక్కడ నేను ఉన్నానని గుర్తు చేశారు. మీకు నీరు చల్లుకునే కోరిక ఉంటే గత ఐదేళ్లు ఎందుకు ఈ ప్రాజెక్టు ప్రారంభించలేదన్నారు. అప్పుడు పనులు పూర్తి చేయలేకపోయిన మీరు ఇప్పుడు క్రెడిట్ తమ ప్రభుత్వం తీసుకుంటుందని బాధపడుతున్నారని విమర్శించారు. ఏదో ఒకరకంగా ఈ ప్రాజెక్టును పూర్తిచేసి ప్రజలకు అంకితం చేయడం జిల్లా మంత్రిగా తన బాధ్యత అని తుమ్మల తెలిపారు. ప్రజాభిమానం ఉంటేనే గద్దెపై ఉంటామన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. బీఆర్ఎస్ నేతల్లో గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి బాధ ఇంకా కనిపిస్తోందన్నారు.

భక్తరామదాసు ద్వారా రూ.60కోట్లతో ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేస్తే రూ.65వేల కోట్ల విలువైన పంటలు రైతులు ఇక్కడ పండించారన్నారు. ఇప్పుడు సీతారామ ద్వారా సాగునీరందిస్తే కూడా ఉన్నంత వరకు అదేస్థాయిలో రైతులు కృష్ణాజలాలు అందకపోయినా గోదావరి జలాలతో పంటలు పండిస్తారన్న విషయం మీరు గుర్తుంచుకోవాలన్నారు. మీ పాలనలో జరిగిన తప్పిదాలను తమ ప్రభుత్వానికి అంటగట్టవద్దన్నారు. గతంలో ఇష్టానుసారంగా గురుకులాలు పెట్టి సమస్యలు గాలికి వదిలేశారని, ఈ ఆరు నెలల్లోనే తమ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నట్టుగా విమర్శలు చేయడం తగదన్నారు. ఆరునెలల్లోనే ఈ ప్రభుత్వంపై అపవాదులు వేసి ప్రజలను నమ్మించాలనుకోవడం వారి అవివేకానికి నిదర్శనమని ఘాటైన విమర్శలు చేశారు.

బైపాస్ కబ్జా!

▸▸ ఖమ్మం నగరంలో ఆగని అక్రమ నిర్మాణాలు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 13: రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి చెందే పట్టణాల్లో ఖమ్మం ముందు వరసలో ఉంది. పదేళ్ల క్రితమే నగరం విస్తీర్ణ అవసరాన్ని గుర్తించిన నాటి ఎమ్మెల్యే, ప్రస్తుత వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోదాడ క్రాస్ రోడ్డు నుంచి కరుణగిరి, రాపర్తినగర్, ఎన్‌టీఆర్ సర్కిల్ నుంచి శ్రీశ్రీ సర్కిల్ వరకు బైపాస్ రోడ్డు నిర్మాణం చేయించారు. ఆ రోజుల్లో ఖమ్మానికి బైపాస్ రోడ్డు అవసరమా అని విమర్శలు చేసిన వారూ ఉన్నారు. అయితే మంత్రి తుమ్మల ఊహించిందే నిజమైంది. ఖమ్మం బైపాస్ రోడ్డు వ్యాపార కేంద్రంగా మారిపోయింది. షాపింగ్‌మాల్స్, హోటల్స్, రెస్టారెంట్లు, కార్పొరేట్ వ్యాపార సంస్థలు, వస్త్ర దుకాణాల నుంచి అన్ని రంగాల వ్యాపార బడా దుకాణాలు ఖమ్మం బైపాస్‌కు వ్యాపించాయి. అయితే అధికారుల అలసత్వంతో కొందరు బైపాస్‌ను మూసేసేలా రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపడుతుండడంతో భవిష్యత్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడే ప్రమాదం పొంచి ఉంది.

అడ్డగోలుగా అనుమతులు మంజూరు

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అడ్డగోలుగా భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడంపై విమర్శలు వెలువడ్డాయి. ఆ తరువాత ప్రజాగ్రహంతో ప్రభుత్వం మారిపోయింది. ఓటర్ల నాడిని గుర్తించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రతి కేఎంసీ సమావేశంలోనూ అక్రమ నిర్మాణాలకు అనుమతి ఇవ్వొద్దని ఆదేశాలు జారీ చేస్తున్నారు. దీంతో కార్పొరేటర్లు, ప్రజాప్రతినిదుల నుంచి ఎటువంటి అక్రమ నిర్మాణల సిఫారసులు రావడం లేదని తెలుస్తోంది. అయితే కేఎంసీ ప్లానింగ్ విభాగంలో అవినీతికి అలవాటుపడ్డ కొంతమంది అధికారులు ప్రభుత్వం మారినా తమ అవినీతి తీరును మార్చుకోవటం లేదు. జీవో-168ను అమలు చేయకుండా మునిసిపల్ చట్టాలను పట్టించుకోకుండా అడ్డగోలుగా నిర్మాణ అనుమతులను జారీ చేస్తున్నారు. గతంలో అంతర్గత భవనాలకు అడ్డగోలుగా అనుమతి జారీ చేసిన అధికారులు ఇప్పుడు ఏకంగా ఖమ్మం బైపాస్ రోడ్డుకు ఇరు వైపుల కనీసం సెట్‌బ్యాక్, పార్కింగ్ స్థలం లేకుండా అనుమతి జారీ చేస్తున్నారు. దీంతో అనుమతి పొందిన భవన యజమానులు ఏకంగా డ్రైనేజీలు, ఫుట్‌పాత్‌లను సైతం అక్రమించి నిర్మాణాలు చేస్తున్నారు. బైపాస్‌రోడ్డులోని ఆర్‌టీఏ కార్యాలయం సిగ్నల్ పాయింట్ వద్ద నిర్మించిన ప్రారంభమైన ఓ భవనం ఇందుకు సాక్ష్యంగా కనిపిస్తోంది. ఖమ్మం నగరంలో కేఎంసీ ప్లానింగ్ అధికారుల పనితీరుకు ఈ భవనం నిదర్శనంగా నిలుస్తోంది.

కనీస నిబంధనలు ఇలా..

మునిసిపల్ చట్టం ప్రకారం నివాసాల నుంచి కమర్షియల్ భవనాల నిర్మాణంలో ఖచ్చితంగా సెట్‌బ్యాక్ నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. మూడు అడుగుల రోడ్డు నుంచి 20 అడుగుల వరకు రహదారి పక్కన నిర్మాణ చేసే భవనాలకు సెట్‌బ్యాక్ తప్పనిసరి చేశారు. 240 గజాల లోపు భవన నిర్మాణం(ఖాళీ స్థలంతో కలిపి) చేస్తే భవనానికి ముందుకు కనీసం 5నుంచి పది అడుగులు, మూడు వైపుల మూడు నుంచి ఐదు అడుగుల సెట్‌బ్యాక్ స్థలం వదలాల్సి ఉంది. 400గజాల నుంచి 500 గజాల వరకు నిర్మాణం చేసే భవనాలకు భవనం ముందు 20అడుగులు మూడు పక్కల పది అడుగులకు పైగా సెట్‌బ్యాక్ ఉండాలి. కానీ కేఎంసీ ప్లానింగ్ అధికారులు ఇటువంటి నిబంధనలు పట్టించుకోవటం లేదు. శ్రీశ్రీ సర్కిల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్, ఆర్టీఏ కార్యాలయం జెంక్షన్, కొత్త బస్టాండ్, రాపర్తినగర్ సెంటర్ వరకు అనేక షాపింగ్ మాల్స్ నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు మీదకు వచ్చి నిర్మాణాలు చేపడుతున్నారు. ఒక్క ఖమ్మం నగరంలోనే భవనాలకు అడ్డగోలుగా అనుమతులు జారి చేసినట్లు విమర్శలు వెలువడుతున్నాయి.

తప్పించుకునే ప్రయత్నాల్లో

అక్రమంగా అనుమతులు జారీ చేసిన ప్లానింగ్ అధికారులు కేఎంసీ నుంచి ఇతర జిల్లాకు బదిలీ కావటంతో ప్రస్తుతం ఇంచార్జ్ బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారులు తమకు ఏం సంబంధం లేదని మాట్లాడుతున్నారు. అక్రమంగా ఇచ్చిన అనుమతులపై తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. కేఎంసీ పరిధిలో బాధ్యత వహించాల్సిన డీసీపీ తాను కేవలం లోకాయుక్త, కోర్టు కేసులనే పరిశీలన చేస్తున్నానని చెబుతుండగా క్షేత్రస్థాయిలో బాధ్యతలు నిర్వహించాల్సిన ఏసీపీలు మాత్రం తప్పించుకుంటున్నారు. ఒకరిపై మరొకరు చెబుతూ తప్పించుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పెరుగుతున్న ప్రమాదాలు

షాపింగ్ మాల్స్, ఫంక్షన్‌హాల్స్, బడా వ్యాపార దుకాణాలకు సెట్‌బ్యాక్, పార్కింగ్ అనుమతి లేకుండా కేఎంసీ అధికారులు అడ్డగోలుగా నిర్మాణ అనుమతులు ఇవ్వటంతో ఆయా షాపింగ్ మాల్స్‌కు వెళ్లిన వారు రహదారిపై వాహనాలను ఉంచుతున్నారు. దీంతో రాపర్తినగర్, పెట్రోల్‌బంక్, ఆర్‌టీఏ సిగ్నల్ పాయింట్, శ్రీశ్రీ సర్కిల్ వద్ద తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తాం: వికాస్, డీసీపీ

ఖమ్మం బైపాస్ రోడ్డు వెంట నిర్మాణం జరుగుతున్న నూతన భవనాలపై ఫిర్యాదులు అందాయి. వారికి నోటీసులు జారీ చేశాం. భవనం నిర్మాణం పూర్తయిన విషయం మా దృష్టికి రాలేదు. ఏసీపీలతో మరోసారి విచారణ చేపడతాం. నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటాం.

భద్రాద్రిలో నేటి నుంచి పవిత్రోత్సవాలు

● 15 నుంచి 19 వరకు నిత్యకల్యాణాల నిలిపివేత



సీతారామచంద్రస్వామి(ఫైల్‌ఫోటో)

భద్రాచలం, ఆగస్టు 13: భద్రాచలంలోని సీతారామ చంద్రస్వామి ఆలయంలో బుధవారం పవిత్రోత్సవాలకు అంకురార్పణ ను గావించనున్నారు.. సాయంత్రం పవిత్ర గోదావరి నదీ జలాల నుంచి తీసుకొచ్చిన తీర్థ బిందెతో పవిత్రోత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. ఈ సమయంలో ఆచార్య, బ్రహ్మ, రుత్వికులకు, వేద పారాయణ దారులకు దేవస్థానం అధికారుల ద్వారా దీక్షా వస్త్రాలను అందజేస్తారు. గురువారం అష్టోత్తర శత కలశావాహన, అగ్ని ప్రతిష్ఠాపన, పవిత్రాదివాసం నిర్వహించనున్నారు. శుక్రవారం నిత్యకల్యాణ మండపంలో శ్రీ సీతారామ చంద్రస్వామి వారికి అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహించనున్నారు. ఇదే సమయంలో మధ్యాహ్నం 12 గంటలకు పవిత్రారోపణ గావించనున్నారు. 17, 18తేదీల్లో నిత్య హోమాలు, వేద పారాయణం నిర్వహించనున్నారు. 19న పూర్ణాహుతి, పవిత్రాల ఉద్వాసన, మహాకుంభ సంప్రోక్షణ గావించనున్నారు. ఇదిలా ఉండగా పవిత్రోత్సవాలను పురస్కరించుకొని గురువారం నుంచి 19వ తేదీ వరకు ఆలయంలో నిర్వహించే నిత్య కల్యాణాలను నిలిపివేయనున్నారు.

జీవనోపాధి కోసం వెసులుబాటు కల్పించుకోవాలి

● ఐటీడీఏ పీవో బి.రాహుల్



జాబ్‌మేళాలో ప్రసంగిస్తున్న పీవో రాహుల్

భద్రాచలం, ఆగస్టు 13: నిరుద్యోగ గిరిజన యువత ఖాళీగా ఉండకుండా, తల్లిదండ్రులను పోషించుకొని అర్హత మేరకు ప్రభుత్వ ఉద్యోగం వచ్చే వరకు జీవనోపాధికి వెసులుబాటు కల్పించుకోవాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. మంగళవారం ఐటీడీఏ ప్రాంగణంలో గిరిజన భవనంలో నిర్వహి ంచిన మెగా జాబ్ మేళా ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగం అనేది ఈ పోటీ ప్రపంచంలో సాధించాలంటే ఎంతో శ్రమించాలన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ మెగా జాబ్‌మేళాలో వివిధ కంపెనీలలో అర్హత మేరకు ఉద్యోగంలో చేరి పనులు చేసుకుంటూ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొని మంచి ఉద్యోగం సాధించాలన్నారు. ఈ జాబ్‌మేళాలలో 1,200 మంది గిరిజన యువత పాల్గొనగా, 400 మందికి వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారికి పీవో రాహుల్ నియామకపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్‌రాజు, జేడీఎం హరికృష్ణ, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సాగుకు జీవం..రైతుకు ఊతం

▸ 15న వైరాలో రాష్ట్ర రైతు పండుగ

▸ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

వైరా, ఆగస్టు 13: సాగుకు జీవం... రైతుకు ఊతం అనే నినాదంతో ఈనెల 15వతేదీన ఖమ్మం జిల్లా వైరాలో తెలంగాణ రాష్ట్ర రైతాంగ పండుగను నిర్వహిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. వైరాలో ఈనెల 15న సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే రైతు బహిరంగ సదస్సు సభాస్థలంలో జరుగుతున్న ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, రాష్ట్ర గిడ్డంగుల, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థల చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో తుమ్మల మాట్లాడారు.

2007 ప్రాంతంలో అప్పటి సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి వత్తిడి మేరకు యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ నేతృత్వంలో నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం దేశవ్యాప్తంగా రూ.72వేల కోట్ల రైతుల రుణాలను ఏకకాలంలో రద్దు చేసిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ లోక్‌సభాపక్ష నేత రాహుల్ గాంధీ వరంగల్‌లో ప్రకటించిన డిక్లరేషన్ ప్రకారం ఇప్పుడు మళ్లీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ రాజ్యం ప్రజాప్రభుత్వం ఏకకాలంలో రూ.రెండు లక్షల రుణమాఫీని రూ.31వేల కోట్ల మేర రద్దు చేస్తుందని ఇది ఒక అద్భుతమని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2014లో ఎన్నికల హామీ మేరకు రూ.లక్షలోపు రుణాన్ని నాలుగు విడతలుగా అమలు చేసిందని ఆనిధులు రైతుల రుణాల వడ్డీలకు కూడా సరిపోలేదని విమర్శించారు. 2018లో మళ్లీ రూ.లక్ష రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన బీఆర్ఎస్ ఎన్నికల చివరి సంవత్సరం రైతు వ్యతిరేకతను ఊహించి హైదరాబాద్ ఓఆర్ఆర్‌ను తాకట్టు పెట్టి అరకొరగా రుణమాఫీ చేసిందని ఆరోపించారు. ఇప్పుడు వైరాలో రూ.రెండు లక్షల రుణమాఫీ చెక్కులను సీఎం రేవంత్‌రెడ్డి అందజేస్తారని అందుకు అవసరమైన నిధులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమకూర్చుతున్నారని, ఆయన ప్రస్తుతం హైదరాబాద్‌లో అదే పనిలో ఉన్నారని పేర్కొన్నారు.

గతంలో రూ.8వేల కోట్లు ఖర్చు చేసినప్పటికీ సీతారామ ప్రాజెక్టు నుంచి చుక్కనీరు కూడా గత పాలకులు ఇవ్వలేకపోయారని విమర్శించారు. తమకు లాభసాటిగా ఉన్న పనులకు మాత్రమే రూ.8వేల కోట్లు ఖర్చుచేసిన, గత పాలకులు ఇప్పుడు అడ్డగోలుగా విమర్శలు చేస్తున్నారని అభ్యంతరం వ్యక్తం చేశారు. తాను సీఎం రేవంత్‌రెడ్డిని ఒప్పించి తక్కువ నిధులతో రాజీవ్ లింక్ కెనాల్ నిర్మించి వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాలకు గోదావరి జలాలు తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టామని ఇది విజయవంతం కాబోతుందని తెలిపారు. అదే సమయంలో జూలూరుపాడ్ యాతాలకుంట టన్నెల్ నిర్మాణాలకు మంజూరు ఇప్పించేందుకు రాష్ట్ర భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఖమ్మం జిల్లాకు తీసుకువచ్చామని దీన్ని కొంతమంది అపహాస్యం చేసి తనను అవమానిస్తున్నారని తుమ్మల దుయ్యబట్టారు. అనంతరం వైరా రిజర్వాయర్‌ను సందర్శించి పరిశీలించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మాజీ వైస్‌ఎంపీపీ కట్ల రంగారావు, నలమల వెంకటేశ్వరరావు, సూతకాని జైపాల్, పణితి సైదులు, దార్న రాజశేఖర్, వడ్డే నారాయణ, రమేష్‌రెడ్డి, రామారావు, సంతోష్, దానియేలు పాల్గొన్నారు.

సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించిన తుమ్మల

వైరా, ఆగస్టు 13: ఖమ్మం జిల్లా వైరాలో 15వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనే రైతు బహిరంగ సభ ఏర్పాట్లను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. ఈ సభాస్థలంలో జరుగుతున్న ఏర్పాట్లను వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, కార్పొరేషన్ చైర్మన్లతో కలిసి పరిశీలించి సమీక్షించారు. సీఎం రేవంత్‌రెడ్డి సహా మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొనే సభావేదిక మొత్తాన్ని కలియ తిరిగి ఏర్పాట్ల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే రైతులు కూర్చునేలా 60 వేలకు పైగా కుర్చీలు వేయాలని ఆదేశించారు. సీఎం రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం 12గంటలకు వైరా చేరుకుంటారని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు మూడు పంపుహౌస్‌ల ప్రారంభ కార్యక్రమం కేవలం పదినిమిషాల్లోనే ముగుస్తుందని తర్వాత నేరుగా వైరా చేరుకొని బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. ఆ తర్వాత హైదరాబాద్‌లో గవర్నర్‌ను కలిసేందుకు వెళ్లిపోతారన్నారు. రైతులను భారీగా సమీకరించి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

హెడ్‌కానిస్టేబుళ్లకు ఏఎస్‌ఐలుగా ఉద్యోగోన్నతి

ఖమ్మంక్రైం, ఆగస్టు13: ఉమ్మడి జిల్లాలో హెడ్‌కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్న పలువురికి ఏఎస్‌ఐలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ, వారికి పలుచోట్ల పోస్టింగ్‌లు ఇస్తూ మంగళవారం పోలీసుశాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డా యి. ఖమ్మం కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న బి.బసవనారాయణకు ఖమ్మం కమిషనరేట్, జి.వెంకటకృష్ణకు భద్రాద్రి కొత్తగూడెం, టి.సూర్యచంద్రరావుకు ఖమ్మం కమిషనరేట్, ఎన్.రామిరెడ్డి భద్రాద్రి కొత్తగూడేనికి, ఎస్‌వీ చంద్రకళదరావుకు భద్రాద్రి కొత్తగూడెం, కె.లక్ష్మణ్‌చౌదరికి భద్రాద్రి కొత్తగూడేనికి, ఇంటలిజెన్సులో ఉన్న ఈ.లక్ష్మణరావుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోస్టింగ్ కల్పించారు. అదేవిధంగా భద్రాద్రి కొత్తగూడెంలో విధులు నిర్వహిస్తున్న బి.సహదేవ్, ఎస్.నాగరాజులకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పోస్టింగ్‌లు కలిపిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం, ఆగస్టు13: ప్రమాదవశాత్తూ చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో జరిగింది. మండలంలోని తిమ్మక్కపేటకు చెందిన వెగ్గళం నరసయ్య చారి(50) ద్విచక్రవాహన మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 11న గ్రామంలోని చెరువుకు చేపల వేటకు వెళ్లాడు. తిరిగిరాలేదు. దీంతో అతడి కోసం కుటుంబసభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. గ్రామంలోని చెరువులో శవమై కనిపించాడు. దీంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్‌ఐ జగదీష్ సందర్శించి వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి...

తిరుమలాయపాలెం, ఆగస్టు13: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో జరిగింది. మండలంలోని పిండిప్రోలుకు చెందిన సూరబోయిన రఘుపతి (50) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం కుక్కలతండా స్టేజీ సమీపంలో నడిచి వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. కాగా మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జగదీష్ తెలిపారు..

రేషన్ బియ్యం పట్టివేత

సత్తుపల్లిరూరల్, ఆగస్టు13: వేంసూరు మండలం భీమవరానికి చెందిన రమణ శ్రీనివాసరావు తన ఆటోలో ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం సత్తుపల్లి పట్టణంలోని తుమ్మూరు రామారావు వీధిలోకి అక్రమంగా తరలిస్తున్నాడు. సమాచారం అందుకున్న సత్తుపల్లి పోలీసులు దాడిచేసి బియ్యాన్ని పట్టుకున్నారు. బియ్యంతో పాటు ఆటోను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఇజ్జగాని చెన్నారావు తెలిపారు.

53వ డివిజన్ జవాన్‌పై కేసు

ఖమ్మం క్రైం, ఆగస్టు13: నగరంలోని 53వ డివిజన్ జవాన్ పృథ్వీ పై మోటర్ వాహనాల చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా ఓ మైనర్ బాలుడితో ద్విచక్ర వాహనాన్ని నడిపిస్తూ, నగర వీధులలో హల్చల్ చేసిన విషయం విదితమే. దీంతో జవాన్ పృథ్వీపై కేసు నమోదు చేసి, రూ. నాలుగు వేల జరిమానా విధించి కౌన్సెలింగ్ కూడా నిర్వహించామని తెలిపారు. అదేవిధంగా ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏసీపీ ప్రకటనలో తెలిపారు.

ఆయిల్‌పామ్ గెలల రవాణా చార్జీలు కంపెనీలే భరిస్తాయి

● టీఎస్ ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి

అశ్వారావుపేట, ఆగస్టు 13: ఇతర జిల్లాల్లో పామాయిల్ గెలల రవాణా చార్జీలను పండు కొనుగోలు చేసిన ప్రైవేట్ కంపెనీలే భరిస్తాయని టీఎస్ ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణలోని ఉమ్మడి మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల్, నాగర్ కర్నూల్ ప్రాంతాలలో ఆయిల్‌పామ్ తోటలను కొన్ని ప్రైవేట్ కంపెనీలు ఆధ్వర్యంలో వేయడం జరిగిందని పేర్కొన్నారు. ఆయా కంపెనీలు ఇప్పటి వరకు ఫ్యాక్టరీలు నిర్మాణం చేపట్టకపోవడంతో, ఆయా కంపెనీలే గెలలను సేకరించి ఫ్యాక్టరీలకు పంపుతారని, అందుకు అవసరమైన రవాణా చార్జీలను ప్రైవేట్ కంపెనీలే భరిస్తాయని తెలిపారు. వివిధ ప్రైవేట్ కంపెనీల ద్వారా వచ్చే గెలలను, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని లేత తోటల నుంచి వచ్చే ఫలసాయాన్ని అశ్వారావుపేట ఫ్యాక్టరీలో క్రషింగ్ చేపట్టడం జరుగుతుందని వివరించారు. ప్రస్తుతం ఆయిల్‌ఫెడ్ ఫ్యాక్టరీలో వచ్చే ఆయిల్ రికవరీ శాతాన్ని బట్టి పామాయిల్ గెలల ధరను నిర్ణయించడం జరుగుతుందన్నారు. అందుకనుగుణంగా లేత తోటల గెలలు, ఇతర జిల్లాల నుంచి వచ్చే గెలలను అశ్వారావుపేట ఫ్యాక్టరీలోను, ముదురు తోటల గెలలను అప్పారావుపేట ఫ్యాక్టరీలోను క్రషింగ్ చేయాలని ఆయిల్‌ఫెడ్ నిర్ణయించడం జరిగిందని ఆయన ప్రకటించారు. దీని వలన అప్పారావుపేట ఫ్యాక్టరీలో వచ్చే ఆయిల్ రికవరీశాతం ఆధారంగా నిర్ణయించే అవకాశం ఉంటుందని వివరించారు.

మంత్రి, చైర్మన్‌కు రైతుల కృతజ్ఞతలు

అశ్వారావుపేట, ఆగస్టు 13: పామాయిల్ ధరపై ప్రభావం చూపకుండా రికవరీ శాతం తగ్గకుండా చూసేందుకు పామాయిల్ రైతులు చేసిన వినతిపై స్పందించి తక్షణమే నిర్ణయం ప్రకటించిన వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు, టీఎస్ ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రామవరెడ్డికి రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు టీఎస్ ఆయిల్‌ఫెడ్ అడ్వయిజరీ కమిటీ సభ్యుడు ఆలపాటి రామచంద్ర ప్రసాద్, రైతు సంఘ నాయకులు కోటగిరి సీతారామస్వామి, బండి భాస్కర్, మొగళ్లపు చెన్నకేశవరావు, కెవీ సత్యనారాయణ, బాలయ్య, బూసి పాండు తదితర రైతులు ప్రకటించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పామాయిల్ సాగును పలు ప్రైవేట్ కంపెనీలకు అప్పగించడం జరిగిందని, ఆయా ఫ్యాక్టరీల పరిధిలో వస్తున్న ఫలసాయాన్ని అశ్వారావుపేటలోని ఆయిల్‌ఫెడ్ ఫ్యాక్టరీలో క్రషింగ్ చేయాలని, ముదురు తోటల నుంచి వచ్చే ఫలసాయాన్ని అప్పారావుపేట ఫ్యాక్టరీలో క్రషింగ్ చేయాలని మంత్రి తుమ్మల, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డిని కలిసి వినతి చేయడం జరిగిందని తెలిపారు. వెంటనే వారు స్పందించి రైతుల కోరిక మేరకు నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు.

పారిశుధ్య కార్మికుడి దుర్మరణం

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 13: ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ పై నుంచి పారిశుధ్య కార్మికుడు పడి మృతి చెందిన సంఘటన నగరంలో మంగళవారం చోటు చేసుకుంది. ఖమ్మం నగరానికి చెందిన చేకూరి జాని(50) పారిశుధ్య కార్మికుడిగా 48వ డివిజన్‌లో పని చేస్తున్నాడు. రోజు మాదిరిగా సారిథినగర్‌లో పారిశుధ్య చెత్త ట్రాక్టర్ పైకి ఎక్కి చెత్తను లోడింగ్ చేస్తున్న క్రమంలో ట్రాక్టర్ పై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న జవాన్, శానిటరి ఇన్‌స్పెక్టర్ గాయపడిని కార్మికుడిని సమీపంలోనే ఉన్న మామిళ్లగూడెం అర్బన్ వైద్యశాలకు తరలించారు. కాగా ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకోని వారు చేతులకు, కాళ్లకు వైద్య సేవలను అందించి ఇంటి వద్ద వదిలి వెళ్లిపోయారు. కొంత సేపటికి జానిని కుటుంబ సభ్యులు చూడగా తలకు వెనుకభాగంలో రక్తస్రావం జరుగుతూ కనిపించింది. వెంటనే కుటుంబ సభ్యులు ప్రైవేట్ హాస్పటల్‌కు తరలించగా, వైద్య సేవలు అందిస్తున్న సమయంలోనే కార్మికుడు మృతి చెందాడు. విషయంపై స్పందించిన కమిషనర్ అభిషేక్‌అగస్త్య బాధిత కుటుంబానికి రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా, దహన సంస్కారాలకు ప్రభుత్వం అందించే రూ.10వేలతో పాటుగా, ఆయన స్వయంగా మరో రూ.10వేలను అందజేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన జవాన్‌ను విధుల నుంచి తొలగించిన అధికారులు శానిటరి ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోకపోవడంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా వీరస్వామి



ఖమ్మం ఖానాపురం హవేలీ, ఆగస్టు 13: ఉమ్మడి ఖమ్మం జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా వీరస్వామిని నియమిస్తూ దేవాదాయ శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఖమ్మం అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వీరస్వామిని ఉమ్మడి ఖమ్మం జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలతో నియమించారు. సాధారణ బదిలీల్లో భాగంగా గత నెల 31న వరంగల్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తూ, ఖమ్మం సూపరింటెండెంట్‌గా బదిలీపై వచ్చారు. అసిస్టెంట్ కమిషనర్‌గా బుధవారం ఉద్యోగ బాధ్యతలు తీసుకుంటానని వీరస్వామి తెలిపారు.

వైద్యం వికటించి మహిళ మృతి

పెనుబల్లి, ఆగస్టు 13: వైద్యం వికటించి మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని లంకపల్లిలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన రాయల లక్ష్మికి(45) పది రోజుల నుంచి జ్వరం వస్తుండటంతో వైద్యం చేయించుకోవడంతో జ్వరం తగ్గింది. కాగా రెండు రోజులుగా ఒళ్లు నొప్పులొస్తుండటంతో స్థానికంగా మెడికల్ షాపు నిర్వహించే యజమాని పిల్లి సత్యంబాబు ఆమెకు ఆదివా రం వైద్యం ప్రారంభించాడు. ఆమెకు సెలైన్ ఎక్కించగా, శరీరంపై దద్దుర్లు రావడంతో అనంతరం మరో ఇంజక్షన్ చేశాడు. దీంతో ఆమెకు వాంతులు అవుతుండటంతో ఆదివారం రాత్రి ఆమెను కుటుంబసభ్యులు సత్తుపల్లి తీసుకువెళ్లారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించగా, అక్కడా పరిస్థితి విషమించడంతో, హైదరాబాద్‌కు వెళ్లాలని వైద్యులు సూచించారు. దీంతో ఆమెను తరలిస్తుండగా మార్గమధ్యలో లక్ష్మి మృతి చెందిందని కుటుంబసభ్యులు, గ్రామస్థులు తెలిపారు. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని వీఎంబంజర్ ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు.

సాగర్‌కాల్వలో పడి వృద్ధురాలు..

నేలకొండపల్లి, ఆగస్టు13: ప్రమాదవశాత్తూ సాగర్ కాల్వలో పడి వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండలంలోని కొత్తకొత్తూరు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామంలోని సీఆర్‌నగర్‌కు చెందిన గుగులోతు బుజ్జి(75) అనే వృద్ధురాలు ఈనెల 12నుంచి కనిపించపోయేసరికి కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం వెతికారు. కాగా మంగళవారం ఇంటి సమీపంలోని సాగర్ కట్టపై వృద్ధురాలు చేతి కర్ర ఉండటాన్ని గమనించి కాల్వలో గాలింపు చర్యలు చేపట్టగా, కాల్వలో మృతదేహం లభ్యమైంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శిశువు మృతదేహం లభ్యం

భద్రాచలం, ఆగస్టు 13: భద్రాచలంలోని గోదావరి వారధి కింద రాళ్ల మధ్యలో గుర్తు తెలియని వ్యక్తులు పాలిథిన్ కవర్లలో చుట్టి మగ శిశువును బ్రిడ్జి కింద నదికి సమీపంలోని రాళ్ల మధ్యలో పడేశారు. గోదావరి నదిలో చేపలవేటకు వెళ్లిన గజ ఈతగాడు ప్రసాద్ బృందం శిశువు పడి ఉండటాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహన్ని గుర్తించి, మార్చురీకి తరలించారు. కాగా ఈ ఘటనపై విచారణ నిర్వహిస్తున్నట్లు సీఐ సంజీవరావు తెలిపారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి

● సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ ఆధ్వర్యంలో నిరసన

కొణిజర్ల, ఆగస్టు13: మండలంలోని గుబ్బగుర్తి పంచాయతీ ఎల్లన్ననగర్‌లో నివాసం ఉంటూ 30 ఏళ్లుగా పోడుభూములను సాగు చేసుకుంటున్న అందరికీ పట్టాలివ్వాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ వైరా డివిజన్ నాయకులు గోగుల సోములు కోరారు. మంగళవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో పోడుభూముల్లో గ్రామస్థులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 200 కుటుంబాల ప్రజలు పోడుభూములను నమ్ముకొని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైన పేదలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, లక్ష్మణ్, బాబు, వెంకన్న, వెంకటేష్, రాము, వెంకటమ్మ, పద్మ తదితరులున్నారు.

మత్స్యకారులపై దాడి చేసిన వారిని శిక్షించాలి



వైరాలో నిరసన వ్యక్తం చేస్తున్న మత్స్యకారులు

వైరా, ఆగస్టు 13: వైరాలో మత్స్యకారులపై దాడులు నిరసిస్తూ మంగళవారం స్థానిక క్రాస్‌రోడ్డు వద్ద జాతీయ ప్రధాన రహదారిపై ఆందోళన నిర్వహించారు. వైరా రిజర్వాయర్‌లో మత్స్యకారులను మోసం చేసి సభ్యుల నుంచి తక్కువ ధరకు కాంట్రాక్టర్ చేపలు కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. తమకు తక్కువ ధర ఇస్తుండటంతో తాము నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం రాత్రి చేపల లోడ్‌తో వెళ్తున్న వ్యాన్‌ను అడ్డుకొని డ్రైవర్‌తోపాటు మత్స్యకారులను కాంట్రాక్టర్ వ్యక్తులు గాయపర్చారని, వీడియోలను పోలీసులకు చూపించి ఫిర్యాదు చేశామని తెలిపారు. వైరా రిజర్వాయర్‌లో కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి మత్స్యకారులు నేరుగా తమకు నచ్చిన వా రికి చేపలు విక్రయించుకొనేలా అవకాశం కల్పించాల ని, కాంట్రాక్టర్ దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు.

'మంత్రి తుమ్మలపై విమర్శలు చేస్తే సహించేది లేదు'

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 13: అవినీతి మచ్చలేని నాయకుడు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆలపాటి రామచంద్రప్రసాద్, బండి భాస్కర్, చెన్నకేశవరావులు అన్నారు. మంగళవారం మండలంలోని నారంవారిగూడెంలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏమారుమూల గ్రామానికి వెళ్లిన ఆయన నిర్మించిన రోడ్లు, భవనాలు, పాఠశాలలు, వంతెనలు, చెరువులు, ప్రాజెక్టులు ఉంటాయని అన్నా రు. సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర జిల్లా నాయకులు సత్యనారాయణచౌదరి, కె.వి సత్యనారాయణ, జీవనరావు, పాష, ప్రసాద్, బాలయ్య తదితరులు ఉన్నారు.

ఇల్లెందు, అగస్టు 13: రాష్ట్రంలో మచ్చలేని రాజకీయ నాయకుడిగా, వివక్షతకు తావు లేకుండా అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి కోసం పాటుపడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపణలు చేయడం ఆయన అవివేకానికి నిదర్శనం అని జిల్లా కాంగ్రెస్ నేత, సింగరేణి కాలరీస్ కార్మిక నాయకుడు కనగాల పేరయ్య విమర్శించారు. ఇల్లెందులో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తుమ్మల పదవుల కోసం, రాజకీయ ప్రయోజనాల కోసం, ఏనాడు వెంపర్లాడలేదన్నారు. హరీష్‌రావు వెంటనే తుమ్మలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

రైతుల కష్టాలు కాంగ్రెస్ ప్రభుత్వానికే తెలుసు

● ఎమ్మెల్యే కోరం కనకయ్య



చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

కామేపల్లి, ఆగస్ట్ 13: రైతుల కష్టాలు కాంగ్రెస్ ప్రభుత్వానికే తెలుసునని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. తాళ్లగూడెంలో మంగళవారం రెండోవిడత రుణ మాఫీ చెక్కులను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత టీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోలేదని అన్నారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి ప్రజలపై భారం మోపారని అన్నారు. రైతులను ఏనాడు పట్టించుకోలేదని వాపోయారు. రుణమాఫీ కమిటిలో జిల్లా మంత్రులు ఉండడం హర్షనీయమని అన్నారు. రూ.రెండు లక్షల రైతు రుణాల కూడా ప్రభుత్వం మాఫీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, బ్యాంక్ మేనేజర్ అబీద్ రెహ్మాన్, మేనేజర్ రామస్వామి, ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ విజయ, పీఏసీఎస్ చైర్మన్ ధనియాకుల హనుమంతరావు, గింజల నర్సింహరెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య, జగన్నాథరెడ్డి, గబ్రూ, సునీతల క్ష్మీనారాయణ, మహేందర్, దమ్మలపాటి సత్యనారాయణ, రాంబాబు తదితరులు ఉన్నారు.

వారసత్వ భూముల కోసం పోరాటం

▸ బేతుపల్లి రెవెన్యూలో 120ఎకరాలలోని సొసైటీ భూమిలో వివాదం

▸ ఓ కౌలురైతు, ఎస్టీ సొసైటీ సభ్యులదే పెత్తనమంటూ మహిళల ఆవేదన



భూముల వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు, వారి కుటుంబ సభ్యులు

సత్తుపల్లిరూరల్, ఆగస్టు13: సుమారు ఐదు దశాబ్దాల క్రితం తమ తాత, తండ్రుల సాగులో ఉన్న భూమిని తమకు పంచాలంటూ మహిళలు కొన్నేళ్లుగా పోరాటం చేస్తున్నారు. సత్తుపల్లి మండలం గంగారంలోని బేతుపల్లి రెవెన్యూలోని సుమారు 120ఎకరాల భూమిని 24కుటుంబాలకు 1969-70లో ఏర్పడిన ఎస్టీ సొసైటీ ఆధ్వర్యంలో పంచారు. అయితే అట్టి భూములకు సంబంధించి కొమరం భీం కాలనీకి చెందిన నలుగురు మహిళా వారసులైన సోయం నాగవేణి, వూకే దివ్య, వూకే కృష్ణకుమారి, వూకే కృష్ణవేణిలు తమకు భూమి పంచడం లేదంటూ మంగళవారం ఆందోళన చేశారు. సాగు చేసేందుకు భూములలోకి వెళ్లగా కౌలురైతు పిడుగు సత్యనారాయణతో పాటు సొసైటీ సభ్యులు తమను అడ్డుకున్నారని వాపోయారు.

తమ సమస్యలపై కల్లూరు ఆర్డీవో, కలెక్టర్‌తో పాటు గత, ప్రస్తుత ఎమ్మెల్యేలను కలిశామని బాధితులు చెబుతున్నారు. తమ తాతలు, తండ్రులు నుంచి వారసత్వంగా వస్తున్న భూమిని అనుభవించేందుకు కూతుళ్లకు హక్కు ఉండదా అని ఆ మహిళలతోపాటు వారి కుటుంబ సభ్యులు, కాలనీవాసులు ప్రశ్నించారు. తాము ఆడపిల్లలుగా పుట్టడమే తమకు శాపమా, ఇతర కులాలకు చెందిన వారిని వివాహం చేసుకుని, పుట్టినింటిలోనే గడ్డు పరిస్థితిలో జీవనం సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఐదు దశాబ్దాలుగా సాగులో 24కుటుంబాలు

గ్రామంలోని 24మందికి అప్పుడు 120ఎకరాల భూమిని పంచగా, ఆ తర్వాత 43 మంది వారసులకు 107.5ఎకరాల భూమిని పంచారని తెలిపారు. మిగిలిన 12.50ఎకరాలలో గ్రామానికి చెందిన వారు కాకుండా, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కాకా ముత్యాలు, కాకా రామచంద్రం, సోయం సీతారాములు, సోయం వసంతరావులకు 10ఎకరాలను సొసైటీ ఇవ్వగా, సాగు చేసుకుంటున్నారని, వారికి లేని అడ్డు మాకెందుకంటూ ప్రశ్నించారు. అయితే 117.5ఎకరాలను పంచగా, 2ఎకరాలతో పాటు ఇంకా కొంత భూమి మిగిలే ఉందని, ఆ భూములను సైతం కౌలురైతుతో పాటు సొసైటీ సభ్యులు అక్రమంగా అనుభవిస్తున్నారని చెబుతున్నారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకొంటున్నారు. కాగా ఇదే విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు తెలపగా, సత్తుపల్లి పట్టణ సీఐ టీ.కిరణ్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.

దేవస్థానంలో ఆ రెండు కౌంటర్లపై పర్యవేక్షణేది!

▸ వ్యక్తిగత అవసరాలకు నగదు వాడుతున్న సిబ్బంది ?

▸ ఇరువురు పర్యవేక్షకులకు మెమోలు జారీ చేసిన ఈవో

భద్రాచలం, ఆగస్టు 13: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలోని ఆర్జిత సేవల టికెట్ల విక్రయ కౌంటర్, ప్రచార కౌంటర్‌లలో పని చేసే సిబ్బంది తమ వ్యక్తిగత అవసరాల కోసం నగదును వాడుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీతాయారు ఆలయం ముందు ఉన్న టికెట్ కౌంటర్లో ఇరువురు ఉద్యోగులు పని చేస్తున్నారు. జూన్ రెండో వారం నుంచి జూలై మూడో వారం వరకు ఆ కౌంటర్లో వచ్చిన నగదును ప్రతి రోజు క్రమం తప్పకుండా ఓచరుపై ఆలయ పర్యవేక్షకుల సంతకాలు తీసుకొని దేవస్థానం అకౌంట్స్ విభాగంలో జమ చేయలేదని వినికిడి. ఈ క్రమంలో అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేసిన క్రమంలో ఈ విషయం వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో పూర్తిస్థాయిలో ఆరా తీయగా రూ.20 లక్షలు పైగా జమ చేయనట్లు సమాచారం. దీంతో అధికారులు సదరు ఉద్యోగులు ఇరువురి నుంచి రూ.16 లక్షలు రికవరీ చేసినట్లు తెలిసింది. మిగిలిన సుమారు రూ.4.50 లక్షలు సదరు ఉద్యోగి నుంచి రికవరీ చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఆలయంలోని తూర్పు మెట్ల వైపు ఉన్న ప్రచార శాఖ స్టాల్‌లో ముత్యాల తలంబ్రాల విక్రయాల్లో రూ.11 వేలకు పైగా నగదు తక్కువ వచ్చినట్లు అధికారులు గుర్తించారు. సదరు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి నుంచి రికవరీ చేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా అకౌం ట్స్ విభాగంలో దేవస్థానంలోని వివిధ విభాగాల నుంచి జమ చేయాల్సిన నగదు వస్తుందో రావడం లేదా?, వాస్తవంగా వచ్చిన నగదు ఎంత, చెల్లించేది ఎంత లాంటి అంశాలను సైతం పర్యవేక్షించకపోవడంతోనే ఇలాంటి తప్పిదాలు చోటు చేసుకుంటున్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కాగా ఇరువురు పర్యవేక్షకులకు ఇప్పటికే మెమోలను జారీ చేశారు.

కాగా అకౌంట్స్ విభాగంలో నిర్ణిత సమయంలో నగదు జమ చేయకపోయినప్పటికీ సంబంధిత ఉద్యోగులు, అధికారులు ఇప్పటి వరకు కనీస స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

చింతకాని విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

చింతకాని, ఆగస్టు 13: చింతకాని లైన్ ఇన్‌స్పెక్టర్ షరీఫ్‌ను సస్పెండ్ చేసినట్లు డీఈ నంబూరి రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల నరసింహపురం గ్రామానికి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ జల్లి రాము విద్యుత్ ప్రమాదానికి గురై, గాయపడిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి లైన్ ఇన్‌స్పెక్టర్ షరీఫ్ విద్యుత్ ఎల్‌సీ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు విచారణలో తెలడంతో, అతడిపై శాఖ పరమైన చర్యలు తీసుకున్నట్లు డీఈ తెలిపారు.

తమ్మిలేరు వంతెనపై బీజేపీ ఆందోళన

సత్తుపల్లిరూరల్, ఆగస్టు13: ఏళ్లక్రితం నిర్మించిన తమ్మిలేరు బ్రిడ్జిని విస్తరించడంతో పాటు ఎలైన్‌మెంట్ మార్చాలంటూ బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. బ్రిడ్జిని పరిశీలించిన అనంతరం వెంటనే ప్రమాదాలను నివారించాలంటే గుంతలను వెంటనే పూడ్చడంతో పాటు వెడల్పు చేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆలయాల సమీపంలో రోడ్డు ఎత్తు పెంచడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి నాయుడు రాఘవరావు, పాలకొల్లు శ్రీను, ఆచంట నాగస్వామి, వసంతరావు, శివ, విజయ్, శేషగిరి, నరసింహామూర్తి, నాగరాజు, నరేష్, ప్రసాద్, సుభానీ, అశోక్, సందీప్ పాల్గొన్నారు. కాగా హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని జాతీయ నాయకుల విగ్రహాలను శుభ్రం చేశారు. ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసేలా పంపిణీ చేస్తున్నట్లు బీజేపీ నాయకులు తెలిపారు.

సీఎం పర్యటనపై ఇంటింటి ప్రచారం

వైరా,ఆగస్టు13: వైరాలో రేపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనే భారీ రైతు బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ జడ్పీటీసీ బొర్రా ఉమాదేవి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి పిలుపునిచ్చారు. రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం మండలంలోని సిరిపురంలో ఉమాదేవి మహిళలతో కలిసి వినూత్న ప్రచారం నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటనర్సిరెడ్డి కూడా మహిళలతోపాటు ప్రచారంలో పాల్గొన్నారు. మాజీ జడ్పీటీసీ నంబూరి కనకదుర్గ, సిరిపురం మాజీ సర్పంచ్ మట్టూరి సత్యప్రసనాంబ, వైరా మునిసిపల్ కౌన్సిలర్లు పణితి ఉష, గుగులోతు లక్ష్మీబాయి, పోటు శ్రీదేవి, తుమ్మల విజయ, సింగు భవానీ, నాయకులు మచ్చా బుజ్జీ, దొడ్డా పుల్లయ్య, మోరంపూడి బాబూరావు, మట్టూరి నాగేశ్వరరావు, కృష్ణారావు, చప్పిడి వెంకటేశ్వర్లు, పఠాన్ జాన్, నారపోగు నాగరాజు, సాధినేని నాగేశ్వరరావు, కూరాకుల నాగమణి, కృష్ణ పాల్గొన్నారు. కాగా భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ వినూత్న రీతిలో ప్రచారం చేశారు. డప్పు వాయిద్యకళాకారులతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులతో కలిసి డప్పు కొడుతూ నృత్యం చేస్తూ ప్రధాన రహదారుల్లో ప్రచారం చేశారు. రాష్ట్ర హస్తకళల అభివృద్ధిసంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


సిరిపురంలో ప్రచారం చేస్తున్న మహిళలు


సమావేశంలో మాట్లాడుతున్న దయానంద్

రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నా

కల్లూరు: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చాక రైతుల సంక్షేమానికి కట్టుబడి పని చేస్తుందని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ అన్నారు. కల్లూరులో స్థానిక మార్కెట్ కమిటీ ప్రాంగణంలో మంగళవారం కాంగ్రెస్ సమావేశం నిర్వహించారు. వైరాలో జరగనున్న సభ రైతుల కష్టాలు తీరనున్న సభగా అభివర్ణించారు. ఈ సమావేశంలో ఏఎంసీ నూతన చైర్మన్ బాగం నీరజదేవి, కాంగ్రెస్ నాయకులు ఎస్‌కే యాఖుబ్‌అలీ, తొటకూర శేషగిరిరావు, బాగం ప్రభాకరచౌదరి, ఏనుగు సత్యంబాబు, అన్నమరాజు, భుక్యా శివకుమార్‌నాయక్, అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఎస్‌కే ఉస్మాన్, తురాబు అలీ, కొండపల్లి శ్రీమన్నారయణ, పంతులు పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయండి

మధిరటౌన్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ కోరారు. మంగళవారం మధిరలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. మధిర రైతాంగానికి సాగునీటి సమస్యలను శాశ్వతంగా తొలగించేలా కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని అన్నారు.

కాంగ్రెస్ ఘనతే

నేలకొండపల్లి:రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు నెల్లూరి భద్రయ్య కోరారు. మంగళవారం సాయంత్రం నేలకొండపల్లిలోని కాంగ్రెస్ కార్యాయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తున్న రాష్ట్ర మంత్రులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించమని, తగిన గుణపాఠం చెపుతామని హెచ్చరించారు.సీతారామ ప్రాజెక్టు ఘనత ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. ఈ సమావేశంలో బొడ్డు బొందయ్య, ఆరెకట్ల గురవయ్య, వెన్నపూసల సీతారాములు,వేగినాటి లక్ష్మీనర్సయ్య, మామిడి వెంకన్న, గూడవల్లి రాంబ్రహ్మం, రాయపూడి నవీన్, కైలాసపు వెంకటేశ్వర్లు, చింతనిప్పు సైదులు, పల్లెబోయిన లక్ష్మీనారాయణ, మైసా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రైతు సదస్సును జయప్రదం చేయండి

ఖమ్మంరూరల్: రేపు వైరాలో జరుగు సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభకు భారీగా ప్రజలు తరలి రావాలని ఖమ్మం రూరల్ మండలం కాంగ్రెస్ అధ్యక్షులు కళ్ళెం వెంకటరెడ్డి, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు బండి జగదీష్ పిలుపు నిచ్చారు. మండల పరిధిలోని నాయుడుపేటలోని ఓ ఫంక్షన్‌హాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులు తెలంగాణ ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు భైరు హరినాద్‌బాబు, బండి జగదీష్, తమ్మినేని నవీన్, చింతమల్ల రవి, కేతినేని వీణు, కృష్ణారావు, శ్రీనివాస్‌రావు, సుబ్బారావు, రామకృష్ణ, అంబేద్కర్ పాల్గొన్నారు.

పరేడ్ గ్రౌండ్‌ను పరిశీలించిన కలెక్టర్

ఖమ్మంకలెక్టరేట్, ఆగస్టు 13: స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో చేపట్టిన ఏర్పాట్లను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మంగళవారం సందర్శించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. వేడుకలకు భద్రత, బందోబస్తు, పోలీసుల కవాతు రిహార్సల్స్ తదితర ఆంశలపై అధికారులతో చర్చించారు. జెండా ఆవిష్కరణ,ముఖ్య అతిథి ప్రసంగం, స్వాతంత్ర్య సమరయోధుల సన్మానం, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉద్యోగులకు అందించే ప్రసంసాపత్రాలు తదితరాలుపై చర్యలు తీసుకోవాలని అన్నారు. పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఏ.నరేష్ కుమార్, డీఈవో సోమశేఖరశర్మ, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, ఏసీపీ సి. సుశీల్‌సింగ్, డీఆర్డీవో విద్యాచందన, ఖమ్మంటౌన్ ఏసీపీ హరికృష్ణ, ఎస్బీ ఏసీపీ ప్రసన్న కుమార్, ఏఆర్ ఏసీపీలు నర్సయ్య, సుశీల్ సింగ్, అర్బన్ తసీల్దార్ సీహెచ్. స్వామి, ఆర్ఐ కామరాజు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

దశల వారీగా అన్ని ప్రాంతాలకు గోదావరి జలాలు

» పువ్వాళ్ల , రాయల

ఖమ్మంసంక్షేమవిభాగం, ఆగస్టు13: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సీతారామా ప్రాజెక్టు ద్వారా దశల వారీగా గోదావరి జలాలను అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కార్యచరణ చేస్తోందని, జిల్లా నుంచే రైతు రుణమాఫీ రూ.2లక్షలు మాఫీ చేయటం హర్షనీయమని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆగస్టు 15న వైరాలో నిర్వహించే బహిరంగ సభలో రైతురుణమాఫీ రూ.2లక్షలు అమలు జరుగుతాయని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు అధికారంలోకి వచ్చినా రైతుల ప్రయోజనాల కోసమే పనిచేస్తోందని గుర్తు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. మాజీఎమ్మెల్సీలు బాలసాని లక్ష్మీనారాయణ, పోట్ల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షులు దొబ్బల సౌజన్య, పుచ్చకాయల వీరభద్రం, సయ్యద్ హుస్సేన్, మేక్యా శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల

రెజోనెన్స్ శ్రీనగర్‌లో విద్యార్థుల మాక్‌ఎన్నికలు

ఖమ్మంఖానాపురంహవేలి,ఆగస్టు13:నగరంలోని శ్రీనగర్ కాలనీలోని రెజోనెన్స్ పాఠశాలలో మంగళవారం విద్యార్థుల మాక్‌ఎన్నికలు నిర్వహించారు. ఈవీఎం మిషన్‌లతో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సీఐ ఆర్.భానుప్రకాశ్, 13వడివిజన్ కార్పోరేటర్ కొత్తపల్లి నీరజ, పాఠశాల డైరెక్టర్లు కొండ శ్రీధర్‌రావు, కృష్ణవేణి హాజరయ్యారు. ఓటు విలువ తెలియజేస్తూ, విద్యార్థిదశలోనే నాయకత్వ లక్షణాలు అలవర్చుకునుటకు ఈ ఎన్నికలు నిర్వహించటం అభినందనీయమన్నారు. ఎన్నికైన విద్యార్థినాయకులను యాజమాన్యం అభినందించారు.



మాక్ పోలింగ్‌ను ప్రారంభిస్తున్న సీఐ భానుప్రకాశ్

స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం

మధిరటౌన్, ఆగస్టు13: మంగళవారం మధిరలోని ఎస్‌బీఐ బ్యాంక్‌లో స్వాసంత్ర్య సమరయోధులను సన్మానించారు. 78వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా సమరయోధుల ఫించన్ పొందుతున్న 38 మందిని ఘనంగా సన్మానించారు. ఎందరో మహనుభావుల పోరాటం, ప్రాణత్యాగాల కారణంగా నేడు మనమందరం సంతోషంగా ఉన్నామని ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్లు బి. పవన్, జి. రవికిరణ్ రెడ్డి అన్నారు. ఆనాడు దేశం కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన అనేక మందిని గుర్తు చేసుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. తెలంగాణవ్యాప్తంగా అన్నిఎస్‌బీఐ బ్యాంకుల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. దీనిలో భాగంగా మధిరలో కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ ఆర్ఎం శివకుమార్, సిరిపురం బ్రాంచ్ మేనేజర్ ఉమేష్ యాదవ్ బ్యాంక్ సిబ్బంది పలువురు ఖాతాదారులు పాల్గొన్నారు.


వెంకటరావమ్మను సన్మానిస్తున్న ఎస్‌బీఐ అధికారులు

రైతుల ఖాతాలకు మాఫీ నగదు

చింతకాని, ఆగస్టు 13: చింతకాని సొసైటీ పరిధిలో రుణమాఫీ పొందిన రైతుల నగదును వారి ఖాతాల్లో జమ చేసినట్లు సొసైటీ చైర్మన్ కొండపల్లి శేఖర్‌రెడ్డి తెలిపారు. రెండు రోజుల్లో ప్రక్రియ మొత్తం పూర్తి చేస్తామని తెలిపారు. నగదు జమ కాని రైతులు వెంటనే సొసైటీ సిబ్బందిని సహకరించాలన్నారు.

ముదిగొండ: వ్యవసాయ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ముదిగొండ సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి సూచించారు. మంగళవారం సొసైటీ కార్యాలయంలో రుణమాఫీ పొందిన 92మంది రైతులకు రూ.55లక్షల కొత్త రుణాలను అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ అలేఖ్య, సీఈవో వెంకటరత్నం, బాషా, రైతులు పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో సత్తా చాటిన న్యూఇరా విద్యార్థి

ఖమ్మం ఖానాపురంహవేలి ఆగస్టు 13: నగరంలోని న్యూఇరా పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న వివాన్ శ్రేయస్ రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఓపెన్ నేషనల్ చాంపియన్ షిప్ ఇండియాస్కేట్ 2024లో సత్తా చాటాడు. ఈ వివరాలు పాఠశాల డైరెక్టర్ డాక్టర్ పి భూమేశ్వరరావు తెలిపారు. కోయంబత్తురులో నిర్వహించిన అండర్ 7-9 క్యాటగిరిలో 1000 మీటర్ల విభాగంలో ఫైనల్స్‌లో ద్వితియస్థానంలో నిలిచాడని తెలిపారు. రాష్ట్రం నుంచి ఈ విద్యార్థి ఒక్కడే ఈలెవల్‌కు చేరాడని తెలిపారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థి వివాన్ శ్రేయస్‌ను అభినందించారు.



మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

» సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లి, ఆగస్టు13: తెలంగాణ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, వారిని ఆర్థికంగా ముందుకు నడిపించాలనే సంకల్పంతో ఇందిరా మహిళా శక్తి పథకానికి శ్రీకారం చుట్టిందని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. ఇందిరా మహిళా శక్తి ఎంటర్‌ప్రైజెస్‌లో భాగంగా ఆరుగురు డ్వాక్రా మహిళలకు రూ.13లక్షలు చొప్పున బ్యాంక్‌ల ద్వారా రుణాలు మంజూరవ్వగా బుగ్గపాడులోని వ్యాపార, వాణిజ్య సముదాయాలను మంగళవారం ప్రారంభించారు. మహిళలను వ్యాపార, పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ పథకానికి రూపకల్పన చేశారని, స్త్రీనిధి ఏర్పాటు, బ్యాంకులతో అనుసంధానం సహా వివిధ మార్గాల ద్వారా ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. బుగ్గపాడుతో పాటు గౌరిగూడెం, బేతుపల్లి, కాకర్లపల్లిలో వ్యాపార సముదాయాలు ఎస్‌బీఐ (ఏడీబీ) మేనేజర్ భైరి వేణు ప్రారంభించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం కేవీసుబ్బారావు, సీసీలు నరేందర్, శ్రీనివాస్, రామారావు, కృష్ణయ్యలతో పాటు వీవోఏలు పాల్గొన్నారు.


బుగ్గపాడులో షాప్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు13: జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికకు ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో సోమశేఖరశర్మ తెలిపారు. ఈ దరఖాస్తులను ఈనెల 20లోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందించాలని తెలిపారు. 2022-23,2023-24లో వివిధ అంశాలతో నిర్ణీత నమూనాలు నేరుగా డీఈవో కార్యాలయానికి అందించాలని తెలిపారు. దరఖాస్తుదారులుపై ఎలాంటి క్రమశిక్షణా చర్యలు పెండింగ్‌లో లేవని, కోర్టు కేసులు పెండింగ్‌లో లేవని ధ్రువీకరణ పత్రాలు అందించాలని తెలిపారు.

జాతీయ జెండాల పంపిణీ


జాతీయ జెండాలు పంపిణీ చేస్తున్న కుమిలి

ఖమ్మంబైపాస్‌రోడ్డు, ఆగస్టు13: బీజేపీ అర్బన్ అధ్యక్షులు కుమిలి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నగరంలోని రోటరీనగర్‌లో మంగళవారం జాతీయ జెండాలు ఉచితంగా పంపిణీ చేశారు. రోటరీ నగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి సుమారు 500 మందికి జాతీయ జెండాలు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో కంపసాటి అంజన్న, నీలిమ, సురేష్, సీతరాములు, సాంబశివరావు, రాము పాల్గొన్నారు.

తల్లాడ: తల్లాడ మండలం కుర్నవల్లి, కలకొడిమ గ్రామాల్లో బీజేపీ ఆధ్వర్యంలో విద్యార్థులకు జాతీయ జెండాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చల్లా నాగులు, సంగీతం సాయిచంద్, రాయల రమేష్, చల్లా నరేష్, శీలం పుల్లారెడ్డి పాల్గొన్నారు.

గాంధీజీ విగ్రహానికి కొత్తశోభ

మధిర, ఆగస్టు 13: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు మంగళవారం ఎస్సీకాలనీలోని గాంధీజీ విగ్రహానికి రంగులు వేసి సుందరంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావు, పాపట్ల రమేష్, రామిశెట్టి నాగేశ్వరరావు, గుండా చంద్రశేఖర్‌రెడ్డి, మర్సకట్ల స్వర్ణాకర్, చిరపంగి యేసు, కోటయ్య పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

తల్లాడ,ఆగస్టు13: లయన్ గోపాల్‌రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా మంగళవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో తల్లాడ మండలం మల్లవరం గ్రామంలో వ్యవసాయ కూలీలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బెల్లంకొండ ఆంజనేయులు, కార్యదర్శి కటికి వెంకటేశ్వరరావు, తోట మురళీ, చిట్టెం నర్సింహారావు, చాపల నర్సింహారావు పాల్గొన్నారు.

దేవులపల్లి రామానుజరావు పురస్కారానికి సీతారాం ఎంపిక

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు13: దేవులపల్లి రామానుజరావు పురస్కారానికి ఈఏడాది ఖమ్మం ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీకళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్ ఆర్ సీతారాం ఎంపికయ్యారు. ఈ మేరకు పరిషత్ అధ్యక్షుడు ఎల్లూరి శివారెడ్డి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇదిగో ఇక్కడదాకే, సన్నాఫ్ మాణిక్యం, కుప్పం కవితలు, అదేపుట విమర్శ వ్యాస సంపుటాలు పరిశోధన గ్రంథాలు వెలువరించారు. ఈనెల24న అవార్డును ప్రదానం చేయనున్నారు.

నవంబరు 24న ఉపకార వేతన పరీక్ష

ఖమ్మంఖానాపురంహవేలి ఆగస్టు 13: 2024-25 విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నవంబర్ 24న నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీఈవో సోమశేఖర శర్మ తెలిపారు. దరఖాస్తులు ఆన్‌లైన్లో రిజిస్టర్‌చేసుకునటకు సెప్టెంబర్ 11 ఆఖరి గడువని తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు నిర్వహిస్తామని చెప్పారు.

యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి



ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 13: జిల్లాలో ప్రభుత్వ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ, పీవైఎల్ జిల్లా బాధ్యులు డిమాండ్ చేశారు. ఆయా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఖమ్మంలో ఏఎస్ఆర్ ప్రభుత్వం జూనియర్ కాలేజీ నుంచి చర్చి కాంపౌండ్ వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వంగూరి వెంకటేష్, జాటోగ్ ప్రేమ్‌సింగ్, మంద సురేశ్, లక్ష్మణ్, శ్రీను, లక్ష్మణ్, సంధ్య, ప్రియాంక, అనూష, అక్బర్, ఝాన్సీ, జాన్‌పాషా పాల్గొన్నారు.

బీమా చెక్కులు అందజేత

కల్లూరు, ఆగస్టు 13 తపాల శాఖలో ప్రతి ఒక్కరు ప్రమాద బీమా పాలసీని వినియోగించుకోని తద్వారా లబ్ది పొందాలని తపాల శాఖ సూపరిండెంట్ వీరభద్రస్వామి అన్నారు. కల్లూరులోని తపాలశాఖ బ్రాంచి కార్యాలయంలో మంగళవారం పలువురికి ప్రమాద బీమా చెక్కులను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐపీ రాజేష్, ఎస్పిఎం రామకృష్ణ, ఎంఓలు కే రాజా, రాజేంద్రప్రసాద్, కల్లూరు, తల్లాడ, పెనుబల్లి మండలాల తపాల సిబ్బంది పాల్గొన్నారు.

నాస్ పరీక్షపై శిక్షణ

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు 13: నవంబరులో జరిగే నాస్ పరీక్షలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం నగరంలోని శాంతినగర్ ప్రభుత్వ పాఠశాలలో ఖమ్మం అర్బన్ మండల జీవశాస్త్ర, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాన్‌బాస్కో, మాధవరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధితులకు చెక్కు అందజేత

ఏన్కూరు,ఆగస్టు13: మండలంలోని టీఎల్‌పేట గ్రామ అగ్నిప్రమాద బాధితులకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో చెక్కును అందించారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.25వేల వంతున నాలుగు కుటంబాలకు లక్షరూపాయలు మంజూరయ్యాయి. వీటిని తహసీల్దార్ శేషగిరిరావు అందించారు. నాలుగునెలలక్రితం తహసీల్దార్ కార్యాలయం నుంచి నాలుగు కుటుంబాలకు రూ.32వేల అందించిన సంగతి విదితమే. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నవీన్, వరుణ్, శివ పాల్గొన్నారు.

నూరుశాతం ఫలితాలు సాధించాలి

ముదిగొండ, ఆగస్టు13: పదిలోనూరుశాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి కేశపట్నం రవికుమార్ సూచించారు. మంగళవారం గోకినపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. మధ్యాహ్నభోజన నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పదిలో మంచి ఉత్తీర్ణత సాధించేందుకు పాటించాల్సిన దినచర్య గురించి విద్యార్థులకు తెలిపారు.

వైరాలో రేణుకాచౌదరి జన్మదిన వేడుకలు


కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా,ఆగస్టు 13: వైరాలో మంగళవారం టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు ఆధ్వర్యంలో కేంద్ర మాజీమంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్‌చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. రేణుకాచౌదరికి కట్ల రంగారావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, నాయకులు కట్ల సంతోష్, దాసరి దానియేలు, దొడ్డా పుల్లయ్య, మచ్చా బుజ్జీ, బీడీకే.రత్నం, మిట్టపల్లి నాగి, పణితి సైదులు, ధార్న రాజశేఖర్, మల్లు రామకృష్ణ, మట్టూరి వెంకటేశ్వరరావు, రేచర్ల నాగేశ్వరరావు, రాముడు, బోళ్ల గంగారావు, పణితి శ్రీను, కంభంపాటి సత్యనారాయణ, పమ్మి అశోక్, చప్పిడి వెంకటేశ్వరరావు, పోటు మధు పాల్గొన్నారు.

కొణిజర్లలో వేడుకలు

కొణిజర్ల:మండలకేంద్రమైన కొణిజర్లలో సూపర్‌జెమ్స్ పాఠశాలలో మంగళవారం కాంగ్రెస్ జిల్లా నాయకులు, కొణిజర్ల మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావు ఆధ్వర్యంలో రాజ్యసభసభ్యురాలు రేణుకాచౌదరి జన్మదిన వేడుకలను నిర్వహించారు. విద్యార్థుల మధ్య కేకుకట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కొణతం ఉమాశంకర్, సొసైటీవైస్‌చైర్మన్ నెల్లూరు రమేష్, గ్రామకాంగ్రెస్ అధ్యక్షుడు గుర్రం రమేష్, భాస్కర్, సురేష్, భరత్, వెంకన్న, మంగపతి తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుల వీరంగం

ఖమ్మంక్రైం,ఆగస్టు13: మద్యం మత్తులో ఇద్దరు యువకులు వీరంగం సృష్టించారు. ఈ సంఘటన సోమవారం రాత్రి ఖమ్మం నగరంలోని సీపీ కార్యాలయం సమీపంలో జరిగింది. త్రీటౌన్ పోలీసుల వివరాలు ప్రకారం.. అల్లిపురానికి చెందిన నరసింహరావు, అతడి భార్య నగరంలోని ఓ షాపులో పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈక్రమంలో సోమవారం రాత్రి విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి వెళుతున్నారు. సీపీ కార్యాలయం సమీపంలోకి రాగానే నగరానికి చెందిన సాయివెంకట్, గణేష్ అనే యువకులు మద్యం మత్తులో ద్విచక్రవాహనంపై అతివేగంగా వస్తూ వీరి వాహనాన్ని ఢీ కొట్టారు. ఘర్షన జరగగా సదరు యువకులు వారిపై దాడి చేశారు. సమీపంలో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆపే ప్రయత్నం చేయగా వారు అగకుండా దాడి చేశారు. ఈఘటనలో నరసింహరావుకు స్వల్పగాయాలు కాగా మంగళవారం త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులు గంజాయి మత్తులో దాడి చేసినట్లు స్థానికులు చెబుతున్నారు.

విద్యార్థులకు పారితోషికం అందజేత

కామేపల్లి,ఆగస్ట్13: మండల పరిధిలోని కొమ్మినేపల్లి హైస్కూల్‌లో గత ఏడాది ఫస్ట్ క్లాస్‌లో ప్రతిభ చూపిన పదిమంది విద్యార్థులకు ఒక్కోరికి రూ.2500 చొప్పున పంపిణీ చేశారు. మంగళవారం పాఠశాలలో బయోస్టాట్ ఇండియా కంపెనీప్రతినిధులు అందజేశారు.విద్యార్థులకు పెన్నులు,ప్యాడులు అందజేశారు.

సీతారామ ప్రాజెక్టు పూర్తి కాకుండానే ప్రారంభిస్తారా

ఖమ్మంమామిళ్లగూడెం, ఆగస్టు 13: సీతారామ ప్రాజెక్ట్ పూర్తి కాకుండా ఎలా ప్రారంభిస్తారని తెలుగుదేశం నాయకులు కొండబాల కరుణాకర్, మల్లెంపాటి అప్పారావు ప్రశ్నించారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా లోని గిరిజన ప్రాంతానికి సీతారామ ప్రాజెక్ట్ ద్వారా నీరుపారే విధంగా చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాగార్జున శ్రీనివాస్, గడిపూడి వెంకటేశ్వర్లు, కిలారు సురేందర్, పాలడుగు క్రిష్ణప్రసాద్, కర్ణాటి అశ్వనీకుమార్, దొడ్డా క్రిష్ణారావు పాల్గొన్నారు .

డంపింగ్ సమస్యపై డ్రైవర్ల నిరసన

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 13: డంపింగ్ యార్డులోకి వాహనం వెళ్లితే తిరిగి రావటానికి పూట సమయం పడుతోంది. రహదారి సక్రమంగా లేక పోవటంతో పారిశుధ్య నిర్వాహణ వాహనాలు నడపటం మా వల్ల కాదూ.. ఖమ్మం కేఎంసీ పారిశుధ్య ట్రాక్టర్, ఆటో డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేశారు. నెల రోజులుగా ఖమ్మం డంపింగ్ యార్డులో రహదారి పొడవునా గుంతలు పడ్డాయి. రెండు వాహనాలు ఎదురెదురుగా వచ్చిన సమయంలో వాటిని తప్పించటం డ్రైవర్లుకు పెద్ద సమస్యగా మారింది. ఒక్కో పారిశుధ్య నిర్వాహణ వాహనం రోజుకు రెండు ట్రిప్పులు వేయాల్సి ఉండగా, ఒకే ట్రిప్పుకు పరిమితమైతున్నాయి. సమస్య పరిష్కారం కాకపోగా ఇటీవల కురిసిన వర్షాలకు డంపింగ్‌యార్డులో రహదారి ఛిద్రంగా మారింది. దీంతో మంగళవారం వాహనాల డ్రైవర్లు విధులు బహిష్కరించారు. కేఎంసీలోకి చేరుకున్నారు. అసిస్టెంట్ కమిషనర్ సంపత్ కుమార్ జోక్యం చేసుకొని డంపింగ్‌యార్డులో రహదారిని కొంతమేర మెరుగు పర్చారు. తర్వాత డ్రైవర్లు విధులు నిర్వహించారు.